Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 07.04.2017, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 44 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

• సమర్ధతకు సమున్నత స్థానం

# రైతే...రాజు



- చంద్రబాబు కొలువులో చంద్రమోహనుడు
- జిల్లా తెలుగుదేశంకు కొత్త గళం... కార్యకర్తలకు మనోబలం
- అత్యంత ప్రాధాన్యతగల వ్యవసాయశాఖ కేటాయింపు

చిత్తూరుజిల్లాలో బొజ్జలను పీకారని తెలుగుతమ్ముళ్ళు వీరంగం... కడప జిల్లాలో వైసిపి నుండి వచ్చిన ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇచ్చారని ప్రత్యర్థి వర్గీయుల అలక... కాంగ్రెస్ నుండి వచ్చిన నాయకుడికి మంత్రి పదవి ఇచ్చారని కృష్ణాజిల్లా నేతల నిప్పులు, తమకు మంత్రి పదవులు రాలేదని గుంటూరు తమ్ముళ్ల ఆగ్రహం... అనంతపురం నుండి శ్రీకాకుళం దాకా చంద్రబాబు మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో రాష్ట్రంలోని 13జిల్లాలకుగాను 12జిల్లాలలో అసంతృప్తి జ్వాలలు చెలరేగాయి. అనర్హులకు మంత్రిపదవులిచ్చారని, అర్హులను దూరంగా పెట్టారంటూ ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి... ఒక్క నెల్లూరుజిల్లాలో మాత్రమే అలాంటి వాతావరణం లేదు, సరికదా మంత్రివర్గ విస్తరణ ద్వారా జిల్లాలో తెలుగుదేశంపార్టీకి ఒక సమర్ధవంతమైన నాయకత్వం లభించిందనే సంతోషకర వాతావరణం నెలకొంది. ఆ సంతోషకర వాతావరణానికి ప్రతిరూపమే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. ప్రత్యర్థులను, రాజకీయ కుయుక్తులను చిత్తుచేస్తూ తన సమర్ధతే గీటురాయిగా రాజకీయ చాతుర్యమే అస్త్రంగా చంద్రబాబు కొలువులో మంత్రిగా ఆశీనుడైన జనం లీడర్... ఈ ఫైటర్.

(మిగతా 11వ పేజీలో)

# విస్తరణతో బయటపడ్డ విభేదాలు

- ఇది టీడీపీ, బీజేపీ, వైసిపిల క్యాబినెట్
- ఫిరాయింపుదార్లకు పదవులపై వెల్లువెత్తిన నిరసనలు

తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు చంఢశాసనుడు. ఆయన మాటకు ఎదురుండదు. అక్కడ ఆయన చెప్పిందే వేదం... చేసిందే చట్టం. ఆయన నిర్ణయానికి ఎదురుచెప్పే ధైర్యం ఎవరికీ ఉండదు. నిజమే చంద్రబాబు గతంలో 9ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినప్పుడు పలుసార్లు మంత్రివర్గంలో మార్పులు చేశారు. అప్పుడు పదవులు కోల్పోయిన వాళ్ళుగాని, ఆశించి పదవులు దక్కనివాళ్ళు గాని నోరెత్తలేదు. ఇది తెలుగుదేశంలో సాంప్రదాయం. ఈసారి కూడా అదే సాంప్రదాయం కొనసాగుతుందని, తాను జరిపే మంత్రివర్గ విస్తరణపై ఎవరూ నోరు మెదపరని చంద్రబాబు బలంగా భావించారు. అయితే ఆయన అంచనాలు తలక్రిందులయ్యాయి.

(మిగతా 11వ పేజీలో)

# స్త్రీ శక్తికి సత్కారం

3లో






# ఆగిన లారీ... సమస్యలతో సవారి



లారీ యజమానుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె గురువారంతో 9వ రోజుకు చేరుకుంది. దీంతో అన్ని రకాల సరుకుల రవాణాకు సంబంధించిన వాహనాలు నిలిచిపోవడంతో ధరలు కొండెక్కి కూర్చున్నాయి. లారీలకు సంబంధించి థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ తగ్గింపుపై మంగళవారం చెన్నైలో బీమా కంపెనీ ప్రతినిధులతో లారీ యజమానుల సంఘం జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీనికితోడు మిగిలిన సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో బంద్‌ను తీవ్రతరం చేయాలని దక్షిణాది రాష్ట్రాల లారీ యజమానుల అసోసియేషన్ నిర్ణయించింది. దీంతోపాటు ఈ నెల 8వ తేదీ నుంచి ఆల్‌ఇండియా బంద్‌కు అసోసియేషన్ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా తిరుగుతున్న లారీలు నిలిచి పోతున్నాయి. ప్రధానంగా కాలంచెల్లిన టోల్‌గేట్లు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు ఒకే పర్మిట్ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. పాలు, గుడ్లు, ఆయిల్, చేపలు, రొయ్యలు తదితర వాటిని రవాణా చేసే వాహనాలను కూడా నిలిపి వేశారు. బంద్ కారణంగా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో కూరగాయల ధరలు చుక్కలనంటుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూరగాయల రవాణా నిలిచిపోవడంతో వ్యాపారులు వాటి ధరలు పెంచేసారు.

కాగా, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకుని గురువారం లారీ యజమాన్య సంఘాలతో చర్చలు జరిపింది. మంత్రి అచ్చెన్నాయుడు వారితో చర్చలు జరిపి సమ్మెను విరమించేలా ఒప్పించారు. లారీ యజమానుల డిమాండ్లకు కొన్నింటిని నెరవేర్చేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో మన రాష్ట్రం వరకు సమ్మెకు తెరదించినట్లయ్యింది. ఈ సమ్మె ఇంకొద్ది రోజులు వుంటే ధరలు ఆకాశాన్నంటి సామాన్యుల బ్రతుకు ఇంకా దుర్భరమయ్యేవి. లారీల సమ్మె దెబ్బకు సిమెంటు బస్తా ధర 300 నుండి 400రూపాయలకు చేరడం తెలిసిందే!

## వీఆర్‌సి వాకర్స్ శ్రీరామనవమి వేడుకలు



ఈ నెల 5వ తేదీన నెల్లూరులోని వీఆర్‌సి మైదానంలో వీఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి సూచన మేరకు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీ రామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి వి.నాగేశ్వరరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా-2 వైస్‌ప్రెసిడెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి, వాకర్స్ గౌరవాధ్యక్షులు డాక్టర్ భాస్కర్‌రావు, డాక్టర్ పెంచలయ్య, ఎ.హజరతయ్య, కాంతారావు, మహిళా వాకర్స్ అధ్యక్షురాలు అనురాధమ్మ, డాక్టర్ శైలజమ్మ, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాకర్స్‌కు వడపప్పు, పానకం పంపిణీ చేశారు.

## ఛలో విజయవాడ

ఈ నెల 8వ తేదీన విజయవాడలోని సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయి. ఈ సభలకు నెల్లూరు, నాయుడుపేట, ఉదయగిరిల నుండి బస్సులు ఏర్పాటు చేసామని, జర్నలిస్టులు పాల్గొనాలని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.జయప్రకాశ్, అధ్యక్షులు వల్లూరు వెంకటేశ్వర్లు బుధవారం నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోరారు. తెలంగాణలో మాదిరిగానే ఏపిలోనూ జర్నలిస్టుల సంక్షేమానికి 50కోట్ల నిధులు విడుదల చేయాలని, వర్కింగ్ జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, రిటైర్డ్ జర్నలిస్టులకు 10వేల రూపాయలు పింఛన్ ఇవ్వాలని, ప్రతి జర్నలిస్ట్‌కు ఇంటి స్థలం కేటాయించి, పక్కా ఇంటి నిర్మాణానికి జి.ఓ విడుదల చేయాలని, జర్నలిస్టు పిల్లలకు 50శాతం రాయితీతో విద్యావకాశాలు కల్పించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ సందర్భంగా ఏపియుడబ్ల్యూజె రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు.

## 30న శ్రీశ్రీ జయంతి వేడుకలు

నెల్లూరు, అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 30వతేదీన మహాకవి శ్రీశ్రీ 108వ జయంతి వేడుకలను నెల్లూరు టౌన్‌హాలు వర్ధమాన సమాజంలో నిర్వహిస్తున్నట్లు అభినయ ఆర్ట్స్ అధ్యక్షులు సిఆర్ రాఘవ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉదయం 10గంటల నుంచి సినీ, లలిత, జానపద, శాస్త్రీయ సంగీత పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పాల్గొంటారని తెలిపారు.

## క్యాన్సర్ ఆసుపత్రికి రూ.లక్ష విరాళం

నెల్లూరు పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి బుధవారం భగవాన్ మహావీర్‌జైన్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు లక్ష రూపాయలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భగవాన్ మహావీర్ జైన్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జె.పి.జైన్ మాట్లాడుతూ ఈ విరాళాన్ని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేద క్యాన్సర్ రోగుల అన్నదానం కొరకు 24వ జైన్ తీర్థంకర్ భగవాన్ మహావీర్‌జైన్ 2626వ జన్మ కళ్యాణం సందర్భంగా వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భగవాన్ మహావీర్‌జైన్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మోహన్‌లాల్ జైన్, కోశాధికారి చంపాలాల్ సభ్యులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

## 9న టౌన్‌హాల్ సంస్థాపక దినోత్సవం

నెల్లూరు నడిబొడ్డున సుదీర్ఘ చరిత్ర కలిగిన రావుబహదూర్ రేబాల లక్ష్మీ నరసారెడ్డి పురమందిరం స్థాపించి 102 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీన 102వ సంస్థాపక దినోత్సవాన్ని ట్రస్ట్‌బోర్డు నిర్ణయం ప్రకారం నిర్వహిస్తున్నట్లు టౌన్ హాలు ట్రస్ట్‌బోర్డు కార్యదర్శి జె.యస్.రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నంది నాటక పోటీల్లో 7 నంది అవార్డులను కైవసం చేసుకున్న పౌరాణిక నాటకం కర్నూలు లలిత కళా సమితి వారి 'ప్రమీలార్జున పరిణయం' పద్యనాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

## మజ్జిగ చలివేంద్రం



శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి సేవాసంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు సంతపేట ములుమూడిబస్టాండ్ సెంటర్‌లో శ్రీరామనవమి సందర్భంగా మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా సేవాసంస్థ అధ్యక్షులు ఖాజన వెంకటశేషయ్య ఆచారి మాట్లాడుతూ ఎండల తాకిడికి వడదెబ్బ తగలకుండా మజ్జిగ, మంచినీళ్లు సేవించాలని, సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజల కోసం చలివేంద్రాన్ని నెల రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాసంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కమనీయం రాములోరి కళ్యాణోత్సవం



శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం నెల్లూరు దర్గామిట్ట, రామ్‌నగర్‌లోని శబరి శ్రీరామక్షేత్రం ఎదురుగా రామకోటి మహా యజ్ఞ స్తూపం ప్రాంగణంలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శబరి శ్రీరామక్షేత్రం ఆలయ కమిటి ఛైర్మెన్ చెన్నూరు వెంకటేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో ఉత్సవం జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తజన సమూహంతో కళ్యాణ మండపం ప్రాంగణం కిటకిటలాడింది. అనంతరం వేదపండితుల వేదమంత్రోచ్ఛారణలతో, మేళతాళాలు, మంగళవాయిద్యాలతో భక్తజనుల శ్రీరామనామస్మరణలతో శ్రీరామక్షేత్రం నుంచి తరలి వచ్చిన వరుడు కోదండరాముడు, వధువు సీతాదేవిని వేదికమీద ప్రతిష్టించారు. రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కుమారుడు సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి - శ్రుతి దంపతులు శ్రీరామ చంద్రమూర్తికి, సీతమ్మ తల్లికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు రొంపిచెర్ల భావనాచార్యుల ఆధ్వర్యంలో కోదండరామునికి, సీతాదేవికి వివాహతంతును విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, కన్యాదానం, మాంగల్యధారణను నిర్వహించారు. అలాగే, నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో వున్న శ్రీరామ మందిరాల్లో శ్రీరామనవమి సందర్భంగా విశేషపూజలు, కళ్యాణోత్సవ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.

## కనులపండువగా సాయినాథుని నగరోత్సవం



నెల్లూరు బాలాజీ నగర్ చివర పద్మావతి నగర్‌లోని శ్రీ సాయి దర్బార్ అద్దాల మందిరంలో శ్రీరామనవమి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. షిరిడి సాంప్రదాయ రీతిలో శ్రీసాయినాథుని పూలరథం, వెండి పల్లకీలో నగరోత్సవం జరిగింది. మతసామరస్యాన్ని చాటుతూ ఫకీర్లు జరబులతో గంధోత్సవం(ఉరుసు), జెండా ఉత్సవం కనుల పండువగా సాగింది. షిరిడిసాయినాథుడి చిత్రపటాన్ని పూలరథంపై ప్రతిష్టించి వెండి పల్లకీలో నగరోత్సవం నిర్వహించారు. ముస్లిం ఫకీర్లు నృత్యగానాలు, బ్యాండు మేళాలతో గుర్రాలు, ఒంటెలతో శ్రీ సాయినామ సంకీర్తనలతో నగరోత్సవం మతసామరస్యానికి ప్రతీకగా సాగింది. నగరోత్సవం పద్మావతినగర్, బాలాజీనగర్, ఏసి నగర్ పురవీధుల గుండా సాగింది. ఈ కార్యక్రమాన్ని శ్రీ సాయిదర్బార్ మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి, సత్సంగ్ సేవాదళ్ సభ్యులు, ట్రస్ట్ సభ్యులు పర్యవేక్షించారు. పలువురు ప్రముఖులు అన్నసంతర్పణ, నగరోత్సవం, పుష్పాలంకరణ, శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం, ప్రసాద వినియోగం కార్యక్రమాలకు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## నేత్రపర్వంగా.. సుదర్శన మహాయాగం



గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి కళ్యాణమండపం వెనుకవైపు వున్న ప్రాంగణంలో ఈ నెల 2వతేదీన ఎంతో విశిష్టమైన శ్రీ అష్టాక్షరీ మంత్రసహిత సుదర్శన మహాయాగాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. లోకకళ్యాణం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నెల్లూరులోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవ సేవాసమితి ఆధ్వర్యంలో, ఆ సేవాసమితి నిర్వాహకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, ఇ.కె సుబ్రహ్మణ్యంల సారథ్యంలో జరిగిన ఈ మహాయాగంలో ప్రముఖ వేదపండితుడు ఫణిశర్మతో పాటు, 41మంది వేదపండితులు పాల్గొని అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ యాగ కార్యక్రమాలను నిర్వహించారు. సంప్రదాయ దుస్తులతో విచ్చేసిన అనేకమంది దంపతులచే వేదపండితులు శాస్త్రోక్తంగా ఈ యాగాన్ని నిర్వహింపజేశారు. ప్రభాతభేరి, వేదపారాయణం, విశేష పూజల అనంతరం శ్రీ అష్టాక్షరీ మంత్రసహిత సుదర్శన మహాయాగాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం మహానివేదన, పూర్ణాహుతి, కలశసంప్రోక్షణలు జరిగిన తర్వాత భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి ఆశ్రమ ఇ.ఓ పి.బాలసుబ్రహ్మణ్యం సహకారంతో భక్తులందరికీ అన్నప్రసాద వితరణ గావించారు.

# స్త్రీ శక్తికి సత్కారం



ఇటీవల శ్రీహరికోటలోని షార్ సెంటర్ నుండి పిఎస్ఎల్వి –సి37 రాకెట్ ద్వారా 104 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టి అంతరిక్ష రంగంలో అంతర్జాతీయ రికార్డు సృష్టించిన ఇస్రో మహిళా శాస్త్రవేత్తలను ఏప్రిల్ 1వ తేదీ వెంకటాచలంలోని అక్షర విద్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి ఎం.వెంకయ్యనాయుడు, పుదుచ్చేరి గవర్నర్ కిరణ్‌బేడిలు సత్కరించారు. రాకెట్ ప్రయోగంలో మహిళా శాస్త్రవేత్తల కృషిని ఈ సందర్భంగా వారు అభినందిస్తూ మహిళలు శక్తి స్వరూపిణులని, వారు తలుచుకుంటే ఏ రంగంలోనైనా రాణించగలరని పేర్కొన్నారు. భారతదేశం వంటి పుణ్యభూమిలో స్త్రీలను దేవతలుగా పూజించే ఓ గొప్ప సంస్కృతి వర్ధిల్లుతుందని అన్నారు. అంతకు ముందు రోజు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉగాది సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఉగాది ప్రాముఖ్యతను, మన పండుగల్లోని గొప్పతనాన్ని వివరించారు. ప్రఖ్యాత అవధాని డా॥ గరికపాటి నరసింహరావు పంచాంగ శ్రవణం చేశారు.

ఈ కార్యక్రమాల్లో మంత్రి కామినేని శ్రీనివాస్, డిఆర్‌డివో సైంటిస్ట్ సతీష్‌రెడ్డి, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఎం.జానకి పాల్గొన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఐ.దీపావెంకట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.



ఈ నెల 6వ తేదీన వెలగపూడి సచివాలయంలోని తన ఛాంబర్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

# 'ఫిక్కీ' విద్యా సదస్సులో డా॥ కిషోర్



సోమవారం న్యూఢిల్లీలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్ఐసిసిఐ) ఆధ్వర్యంలో జరిగిన స్కూల్ ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్‌లో డా॥ కిషోర్స్ రత్నం జెన్‌నెక్స్ట్ విద్యాసంస్థల డైరెక్టర్ డా॥ కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో హర్యానా హెచ్‌ఆర్‌డి మంత్రి ప్రభాత్‌జైన్, ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్, హర్యానా రాష్ట్ర విద్యాశాఖ అదనపు ముఖ్య కార్యదర్శి పి.కె.దాస్, కేంద్ర ఆహారభద్రతా ప్రమాణాల సంస్థ సిఇఓ పవన్‌కుమార్‌లను డాక్టర్ కిషోర్ కలిసి ప్రస్తుత విద్యా ప్రమాణాలపై చర్చించారు. ఎందరో ప్రముఖులు పాల్గొన్న ఈ సదస్సులో డాక్టర్ కిషోర్ నేటి విద్యారంగంపై తన వాణిని వినిపించారు. ఈ సందర్భంగా ఇంకా పలువురు ప్రముఖులను ఆయన కలుసుకున్నారు.

# బాలూ కీర్తికిరీటంలో మరో మణిరత్నం

## ఎన్టీఆర్ జాతీయ అవార్డుకు గానగంధర్వుడు



ప్రఖ్యాత గాయకుడు, గానగంధర్వుడు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యంకు ప్రతిష్టాత్మకమైన ఎన్టీఆర్ జాతీయ అవార్డు లభించింది. దీంతో బాలూ అభిమానుల్లో.. ప్రత్యేకించి నెల్లూరీయుల్లో సంతోషం వెల్లువెత్తింది. చలనచిత్రసీమలో వేలాది పాటలను అత్యద్భుతంగా గానంచేస్తూ.. తన గాన లాహిరిలో అశేష ప్రేక్షకజనసందోహాన్ని..లక్షలాది మంది శ్రోతలను ఉర్రూతలూగిస్తున్న బాలూకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందజేయనున్న ఈ విశిష్టమైన అవార్డు తెలుగుపాటకు..తెలుగుజాతికే ఒక ప్రత్యేకమైన గౌరవమని చెప్పవచ్చు. 2012 సంవత్సరానికి రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన చలనచిత్ర ప్రముఖులను ఈ అవార్డులకు ఎంపిక చేయగా, అందులో ఎన్టీఆర్ జాతీయ చలనచిత్ర అవార్డు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యంకు లభించిందని కమిటీ సభ్యులైన ప్రముఖ నటులు నందమూరి బాలకృష్ణ, మురళీమోహన్‌లు హైదరాబాద్‌లో ఈనెల 4న జరిగిన కార్యక్రమంలో ప్రకటించారు. అదేవిధంగా, 2013 సంవత్సరానికి ఈ ప్రతిష్టాత్మకమైన ఎన్టీఆర్ జాతీయ అవార్డుకు ప్రముఖ బాలీవుడ్‌నటీమణి హేమమాలిని ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ అవార్డు కింద అవార్డు గ్రహీతలకు 5లక్షల రూపాయల పారితోషికంతో పాటు, ప్రత్యేక జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తామన్నారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో భాగంగా బిఎన్‌రెడ్డి అవార్డును ప్రముఖ దర్శకులు సింగీతం శ్రీనివాసరావు (2012), కోదండరామిరెడ్డి (2013)లకు అందజేయనున్నామన్నారు. ఈ అవార్డు కింద 2లక్షల నగదుతో పాటు జ్ఞాపిక అందజేస్తారు. నాగిరెడ్డి–చక్రపాణి అవార్డులను ప్రముఖ నిర్మాతలైన దగ్గుబాటి సురేష్‌బాబు (2012), దిల్‌రాజు(2013)లకు అందజేయనున్నారు. మరో ప్రతిష్టాత్మకమైన రఘుపతి వెంకయ్య అవార్డు ప్రముఖ దర్శకుడు కోడి రామకృష్ణ, కళాభినేత్రి వాణిశ్రీ (2013)లు అందుకోనున్నారు.

# బాధితులకు కోటంరెడ్డి ఓదార్పు



ఈ నెల 5వ తేదీన నెల్లూరురూరల్ మండలం మాదరాజుగూడూరులో అగ్ని ప్రమాదం సంభవించి మర్రిపాటి లక్ష్మి అనే మహిళ ఇల్లు పూర్తిగా కాలిపోయింది. దాదాపు లక్ష రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. విషయం తెలిసిన వెంటనే రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్పందించారు. సంఘటనా స్థలానికి వెళ్లారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి కొంత నగదు సాయంతో పాటు నిత్యావసర సరుకులను కూడా అందజేశారు.

# ఎమ్మెస్సార్ సేవా సమితి మజ్జిగ చలివేంద్రం



నెల్లూరు జిల్లాలో వివిధ రంగాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువ జన సేవాసమితి వారు మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని రోడ్ల మీద నడిచే దాహార్తుల సౌకర్యార్థం నగరంలోని డికెడబ్ల్యూ కాలేజీ వద్ద మజ్జిగ మరియు మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 4వ తేదీన ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పీ ఎన్.సుధాకర్, నెల్లూరు 1వ నగర సిఐ అబ్దుల్ కరీంల చేతుల మీదుగా ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు కమతం అశోక్, సాయికృష్ణ, మాతయ్య, రాజు, ముని, కిట్టు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## 'ప్రభా'తం

# ఫిరాయింపులకు ప్రోత్సాహం

**నియమ నిబంధనలను అతిక్రమించి పార్టీలు ఫిరాయించేవారికే ఇప్పుడు కాలం కలిసొస్తోంది. ఫిరాయింపుదారులకు ఇప్పుడు ఏకంగా మంత్రి పదవులు కూడా వచ్చేస్తున్నాయి. అది నైతికమా?..అనైతికమా పట్టించుకోకుంటే ఎలా?..ఇకనైనా ఆ తీరు మారాలి. ఫిరాయింపులకు ఫుల్‌స్టాప్ పెట్టాలి. ప్రజాభిప్రాయాలను గౌరవించే రీతిలో రాజకీయాలు వుండాలే తప్ప, నీతులు ఒకరికి చెప్పేవే కానీ..మనం ఆచరించేందుకు కాదన్నట్లుగా వుండడం అధికారపార్టీకే కాదు..ఏ పార్టీకీ మంచిది కాదు.**

మన రాష్ట్రంలో..అందులోనూ టిడిపి అధికారంలోకి వచ్చాక రాజకీయాలు రోజుకో రంగు పులుముకుంటున్నాయి. పురుషులందు పుణ్యపురుషులు వేరయా.. అన్నట్లు రాజకీయాల్లో మంచి రాజకీయాలు ఇప్పుడు కలికానికి కూడా కన్పించడం లేదు. ఇప్పుడంతా నాన్చుడు రాజకీయాలు, ఊసరవెల్లి రాజకీయాలు.. గోడమీద పిల్లి రాజకీయాలు.. అవినీతి రాజకీయాలు.. అడ్డగోలు రాజకీయాలు పెరిగిపోయాయి. విశుద్ధమైన రాజకీయాలు మాత్రం నానాటికీ కనుమరుగైపోతున్నాయి. ఇప్పుడు తాజాగా అందరి నోళ్ళలోనూ నానుతోంది.. ఫిరాయింపు రాజకీయాలు. అదికూడా అధికారపార్టీ పుణ్యమే. తమ పార్టీ కానివారు వచ్చి చేరినా, ఎలాంటి నిబంధనలను పాటించకుండానే వారికి అగ్రతాంబూలం ఇచ్చేసి 'ఫిరాయింపులకు నజరానా' అన్నట్లుగా మంత్రిపదవులను ఇచ్చేయడం రాజకీయవర్గాల్లో కలకలం రేపుతోంది. రాష్ట్రంలో ఇప్పుడు ఎక్కడ విన్నా ఇదే టాపిక్.

ఇటీవల రాష్ట్ర మంత్రివర్గంలో నలుగురికి మంత్రిపదవులు ఇవ్వడం, ఆ నలుగురూ గతంలో వైఎస్సార్సీపి ఎమ్మెల్యేలుగా గెలిచినవారు కావడం, వారు టిడిపిలో చేరినా వైఎస్సార్సీపికి రాజీనామాలు చేసినట్లు కానీ, ఆ రాజీనామాలను ఆమోదించినట్లు గానీ అధికారికంగా ప్రకటించకుండానే..ఆ నలుగురికీ మంత్రి పదవులు ఇవ్వడం..ఇదే చర్చ. అధికారపార్టీ అయిన టిడిపి చేసిన ఈ నిర్వాకాన్ని ఎలా అర్థం చేసుకుని సమర్థించాలో తెలియక టిడిపిని సమర్థించే రాజకీయవర్గాలు సైతం ఈ విషయంలో తలలు పట్టుకుంటున్నాయి. ఒక పార్టీ గుర్తుపై నిలిచి గెలిచిన వారు, ఆ పదవికి రాజీనామా చేయకుండా నియమాలను అతిక్రమించి మరో పార్టీలోకి వెళ్ళడం అనైతికమని, అది ఫిరాయింపు అవుతుందని నిబంధనలు చెప్తున్నాయి. ఒక పార్టీని అభిమానించి ప్రజలు ఓట్లేస్తే, అలా గెలిచినవారు చెప్పాపెట్టకుండా మరో పార్టీలోకి దూకేస్తే ఇక ప్రజాస్వామ్య విలువలకు అర్థం ఏముంటుంది?..అన్నది సామాన్యుల ప్రశ్న. ఒకవేళ అలా వెళ్ళాలనుకున్నప్పుడు ముందుగా గెలిచిన పార్టీకి రాజీనామాలు చేసి వెళ్ళాలన్న నైతికసూత్రాన్ని కూడా పాటించకుంటే ఎలా?.. పోనీ, ఆ నలుగురినీ తమ పార్టీలోకి చేర్చుకుంటున్నప్పుడు అధికారపార్టీయే ఎలాంటి నిబంధనలను పాటించకపోవడం ఏమిటి?.. ఇలా ఎవరి చిత్తానుసారం అది జరిగిపోతుంటే..ఇక ఫిరాయింపులకు అంతూపొంతూ ఏముంటుందన్నది సామాన్యుని సణుగుడు. క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే బిజెపికి మిత్రపక్షంగా వున్న టీడీపీలో ఇలాంటి అనైతిక విషయాలు ఎంతో ఆర్భాటంగా జరిగిపోతున్నా బీజేపీ కూడా నిమ్మకు నీరెత్తినట్లుండడం మరిన్ని విమర్శలకు దారితీస్తోంది. ఫిరాయింపుల నిరోధానికి చట్టాలు, నిబంధనలు వున్నా అన్నిటినీ అతిక్రమించి అధికారపార్టీ తమకు నచ్చిందే చట్టమన్నట్లుగా వ్యవహరిస్తుండడం దారుణం. చట్టాలు చేసేవారే చట్టాలను గౌరవించకుండా ఇలా అనైతికంగా ప్రవర్తిస్తుండడం పట్ల సర్వత్రా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది కూడా. అంతా జరిగిపోయాక.. నాలుక్కరుచుకుని ఆ నలుగురూ ఎప్పుడో రాజీనామాలు చేసేశారని అంటుండడం మరోవైపు ఆయా వర్గాల్లో నవ్వుతెప్పిస్తోంది. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా వుంటున్న ఇలాంటి ఫిరాయింపులను కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి అయినా నిలువరించాల్సింది.. కానీ, మిత్రపక్షం చేస్తున్న పనిని చూస్తూ మౌనంగా వుండడం వల్ల ఇప్పుడు ఈ విషయంలో బిజెపి చిత్తశుద్ధిని కూడా శంకించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని బిజెపి వర్గాల అంతర్గత ఆవేదన.

రాష్ట్ర మంత్రివర్గంలో ఫిరాయింపుదారులకు మంత్రి పదవులు కట్టబెట్టి రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారంటూ బిజెపి సీనియర్ నాయకురాలు, కేంద్ర మాజీమంత్రి దగ్గుబాటి పురందేశ్వరి ఆవేదన చెందడాన్ని ఈ సందర్భంగా గమనించాల్సి వుంది. అంతేకాదు, దీనిపై ప్రధాని మోదీకి, బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు లేఖలు రాశానని ఆమె పేర్కొంటున్నారు. చట్టాలను చేయాల్సినవారే రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడడం శోచనీయమని, ఎన్టీఆర్ హయాంలో రాజ్యాంగం ఉల్లంఘనలను ప్రోత్సహించేవారు కాదని, అప్పట్లో కొందరు ఎమ్మెల్యేలు టిడిపిలోకి వస్తా మన్నప్పుడు ముందుగా పదవికి, పార్టీకి రాజీనామా చేసి వస్తేనే టిడిపిలోకి ఆహ్వానిస్తామని ఎన్టీఆర్ స్పష్టం చేసేవారని ఆమె గుర్తుచేస్తున్నారు.

అలాంటి మహోనేత స్థాపించిన ధీరగంభీరమైన పార్టీలో ఇప్పుడు ఫిరాయింపులకు తలుపుల బార్లా తెరవడాన్ని ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. కష్టపడి పనిచేసే వారిని, బతికినంతకాలం పార్టీ జెండా మోస్తున్నవారిని పట్టించుకోకుండా..అప్పటికప్పుడు కప్పల తక్కెడలా ఎటుపడితే అటు పార్టీలు మారే ఫిరాయింపుదారులకు మంత్రి పదవుల వంటి పెద్దపెద్ద పదవులు కట్టబెట్టడం అధికారపార్టీకే కాదు.. ఏ పార్టీకీ మంచిది కాదని, రాజకీయాల్లో నైతికత అనేది నేతి బీరలో నెయ్యి కాకుండా చూడాల్సిన అవసరం వుందని రాజకీయ విజ్ఞుల సూచన. మరోవైపు, ఆ నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామాలు చేశారని ఇప్పుడు చెప్తున్నారని, అయితే నిజంగా వారు రాజీనామా చేస్తే వాటిని ఆమోదించి తాజాగా ప్రజాతీర్పు కోరాలని వైఎస్సార్సీపి నాయకుడు వై.వి సుబ్బారెడ్డి చేస్తున్న డిమాండ్ సమంజసమైనదే.

ఏదేమైనా, ఫిరాయించిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వడం నైతికమా?..అనైతికమా అన్నది రాజకీయవర్గాలు ఎవరికి వారు చిత్తశుద్ధితో ఆలోచించుకోవాల్సిన విషయం. ఇప్పటికైనా ఫిరాయింపులకు ఫుల్‌స్టాప్ పెట్టి ప్రజాభిప్రాయాలను గౌరవించే రీతిలో రాజకీయాలు వుండేలా చూసుకోవడం అన్నిపార్టీల కర్తవ్యం. అలా కాక, తమదాకా వస్తేనే కానీ పట్టించుకోని నిర్లిప్తధోరణి, నీతులు ఒకరికి చెప్పేవే కానీ..మనం ఆచరించేందుకు కాదన్నట్లుగా వుండే నిర్లక్ష్యధోరణి అధికారపార్టీకే కాదు.. ఏ పార్టీకీ మంచిది కాదు. ప్రజల ఆశలు ఆకాంక్షలు తీర్చేవిధంగా రాజకీయాలు వుండాలే తప్ప..తమ చిత్తం తమదే అన్నట్లుగా వ్యవహరించడం ఏనాటికీ సముచితం కాదని వేరే చెప్పనక్కర్లేదు!...

# ఆడవేషంతో 'దాడి-దోపిడీలు'

- జల్సాల కోసం దారితప్పిన యువకులు
- వల పన్ని పట్టుకున్న పోలీసులు

జల్సాలకు అలవాటుపడిన కొంత మంది యువకులు డబ్బు కోసం నేరగాళ్ళుగా మారి జీవితాలను నాశనం చేసుకున్నారు. దారి దోపిడీలు చేస్తూ, దాడులు దోపిడీలకు అలవాటు పడి, చివరికి పోలీసులకు చిక్కిపోయారు. ఈ నేరగాళ్ళ ముఠాను దొరవారిసత్రం పోలీసులు వల పన్ని మరీ పట్టుకున్నారు. గూడూరు ఇన్‌ఛార్జి డిఎస్పీ శ్రీనివాసాచారి, నాయుడుపేట సిఐ రత్తయ్య ఆదివారం దొరవారిసత్రం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, ఈ నేరగాళ్ళు ఎలా నేరాలు చేస్తూ దొరికిపోయారో వివరించారు. రాత్రివేళల్లో దారిదోపిడీలకు పాల్పడే ఈ ముఠాలో వెంకటగిరి శ్రీరామ్, నాగుల అజయ్, దేగా శీనయ్య, సొత వెంకటేశ్వర్లు, సాగ వినోద్, వెంకటగిరి వెంకటేష్ అనేవారంతా కలిసి ఒక ముఠాగా ఏర్పడి నేరాలకు పథకం వేశారు. వీరంతా గతంలో కప్పరాళ్ళతిప్ప నివాసులు. ఇప్పుడు నెల్లూరు, శ్రీకాళహస్తి ప్రాంతంలో నివాసం వుంటున్నారు. వీరిలో ముఖ్యుడైన వెంకటగిరి శ్రీరామ్ రాత్రివేళల్లో ఆడవేషం వేసుకుని జాతీయరహదారిపై వెళుతున్న లారీలను నిలిపేవాడు. డ్రైవర్లను నిర్మానుష్యంగా వున్న ప్రదేశంలోకి తీసుకువెళ్ళేవాడు. ఇదే అదనుగా మిగిలిన ముఠా సభ్యులంతా కలసి ఆ డ్రైవర్‌పై హఠాత్తుగా దాడిచేసి, విచక్షణారహితంగా కొట్టి.. అతనివద్ద వున్న డబ్బునంతా గుంజుకునేవారు. ఆ తర్వాత లారీలో వున్న నగదును కూడా దోపిడీ చేసేవారు. ఒకవేళ ఆ డ్రైవర్ వద్ద డబ్బు లేకుంటే మరింతగా కొట్టి గాయపరచేవారు. ఇంత జరిగినా డ్రైవర్లు ఎవరికీ ఈ విషయం చెప్పుకునేవారు కాదు. రాత్రిపూట రోడ్డుపై ఆడది కనిపిస్తే తాము మోసపోయి.. వెంట వెళ్ళి నందువల్లే తమకీ దుర్గతి పట్టిందని ఎవరికీ చెప్పుకోలేక తేలుకుట్టిన దొంగల్లా.. ఎవరి పాటికి వాళ్ళు ఏడుస్తూ వెళ్ళిపోయేవారు. ఇలా ఎంతోమంది డ్రైవర్లు వీరిచేతిలో చావు దెబ్బలు తిన్నారే తప్ప, ఎవరికీ తమకిలా జరిగిందని చెప్పుకున్నది లేదు. ఇలా అనేకమంది డ్రైవర్లు ఆ నేరగాళ్ళ చేత దెబ్బలు తినడమే కాక.. జేబులో వున్నది పూడగొట్టుకున్నారు. లారీలో డబ్బును కూడా పోగొట్టుకున్నారు. ఇలా జరుగుతోన్న క్రమంలో..గత నెల 30వ తేది రాత్రి జరిగిన సంఘటనతో ఈ ముఠాకు మూడింది. ఆరోజు రాత్రి కలగుంట బ్రిడ్జి వద్ద రోసనూరు క్రాస్‌రోడ్డు దగ్గర ఈ ముఠా ఇలాగే దోపిడీకి పాల్పడింది. గంటలోపలే ఇద్దరు లారీడ్రైవర్లను కొట్టి వారి వద్ద వున్న 13వేల రూపాయలను దోచుకోవడంతో ఆ డ్రైవర్లు నేరుగా వెళ్ళి దొరవారిసత్రం పోలీసులకు జరిగిందంతా చెప్పి తమ గోడు విన్నవించుకున్నారు. అంతే, పోలీసులు వెంటనే అప్రమత్తమై రంగంలోకి దిగడంతో ఆ ముఠా ఆట కట్టయింది. ఆ రాత్రే, కొద్ది గంటల్లోపలే పోలీసులు వల పన్ని ఆ దోపిడీ ముఠాను పట్టుకుని తమ సమర్థతను చాటుకున్నారు. ఆ ముఠా నుంచి 13వేల నగదుతోపాటు, నాలుగు సెల్‌ఫోన్‌లు కూడా స్వాధీనం చేసుకుని, ఆ నేరగాళ్ళనంతా పట్టుకుని పోలీసు ఉన్నతాధికారులకు అప్పగించారు. దొరవారిసత్రం మండలంలోని కలగుంట రైల్వే బ్రిడ్జి ప్రాంతం, ఓజిలి చెరువు సమీపంలోనూ ఈ ముఠా నేరాలకు పాల్పడుతుండేదని, ఎట్టకేలకు పోలీసులు వారిని పట్టుకున్నారని పోలీసు ఉన్నతాధికారులు ఈ సందర్భంగా వివరించారు. ఈ నిందితులందరినీ సూళ్ళూరుపేట కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారికి 14 రోజులపాటు రిమాండ్ విధించింది, అనంతరం వారిని నెల్లూరుజైలుకు తరలించామని డిఎస్పీ తెలిపారు. ఈ ముఠాను చాకచక్యంగా పట్టుకున్న దొరవారిసత్రం పోలీసులను ఆయన అభినందించారు. ఎస్ఐ కోటి రెడ్డిని, హెడ్ కానిస్టేబుల్స్ రాఘవయ్య, వెంకటయ్య, కానిస్టేబుల్స్ బాబ్జి, సునీల్, కిషన్, వెంక టేశ్వర్లుతో పాటు హోంగార్డ్ షాహుల్, నరేష్‌ను డిఎస్పీ అభినందించి, వారికి రివార్డులు అందజేశారు.

## విలువలు పతనం

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేలు నలుగురికి మంత్రి పదవులివ్వడం ద్వారా చంద్రబాబునాయుడు రాజ్యాంగ విలువలకు సమాధి కట్టాడు. ఒకరికి పుట్టిన బిడ్డలను తన బిడ్డలని చెప్పుకోవడం ఎంత నీతిమాలిన పనో, ఇంకో పార్టీ ఇమేజ్‌తో గెలిచిన ఎమ్మెల్యేలను తన పార్టీ ఎమ్మెల్యేలని చెప్పుకోవడం అంతే నీచం. పార్టీ ఫిరాయింపుల గురించి మాటల కోటలు కడుతూ పార్టీలు మార్చే నాయకులను పక్కా వ్యభిచారులతో పోల్చే కేంద్రమంత్రి వెంకయ్యానాయుడు కూడా ఈ విషయంలో చంద్రబాబు వైఖరిని మందలించకపోవడం, ప్రశ్నించకపోవడం ఆయన రెండు నాల్కల వైఖరికి అద్దం పడుతోంది. కనీసం గవర్నర్ అయినా ఈ విషయంలో విలువలను కాపాడడానికి చొరవచూపి వుంటే బాగుండేది. ఆయన దేవాలయాలు తిరిగే ఒత్తిడిలో ఈ విలువల పతనాన్ని గమనించినట్లుగా లేదు.

– పిండి వాసుదేవరావు, తిరుపతి.

## సమర్థతకు కొలువు

మూడేళ్ళుగా నెల్లూరుజిల్లాకు మంత్రి లేనట్లుగానే వుంది. నారాయణ మంత్రిగా వున్నప్పటికీ జిల్లాకు గాని, తెలుగుదేశం కార్యకర్తలకు గాని ఒరిగిందేమీ లేదు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోవడంతో నెల్లూరుజిల్లాలో తెలుగుదేశం కార్యకర్తలకు ధైర్యం వచ్చింది. సోమిరెడ్డి పార్టీకి విధేయుడు. పార్టీ కోసం ఎంతో నష్టపోయాడు. ఈరోజుకీ కార్యకర్తలకు జనానికి అందుబాటులో ఉండే నాయకుడు. ఆయనకు మంత్రి పదవి ఇచ్చి మంచిపని చేశారు.

– చక్కిరాల శ్రీధర్, నెల్లూరు.

## సీఎం అంటే ఇతనేరా?

యోగి ఆదిత్యనాథ్... ఉత్తరప్రదేశం సీఎం. పెళ్ళి లేదు... బంధాలు లేవు... బంధుత్వాలు లేవు... అవినీతికి, ఆర్భాటాలకు ఆస్కారం లేదు. ప్రజాదోపిడీకి స్థానమే లేదు. ముఖ్యమంత్రి కాగానే గోవధశాలలు మూయించాడు. గోవధ నిషేధంపై దృష్టి పెట్టాడు. గోవధను అరికట్టాడు. పాలిచ్చే పాడిఆవులను కాపాడుకోవాల్సిన అవసరం ఈ సమాజానికి ఎంతైనా వుంది. ఓట్ల ముసుగులో కొన్ని పార్టీలు గోవధను ప్రోత్సహిస్తున్నాయి. ఈ సిగ్గు మాలిన పార్టీలన్నింటికీ యోగి ఆదిత్యనాథ్ చర్యలు చెంపపెట్టు కావాలి.

సి. రాజీవి, నెల్లూరు.



# సేవకు స్ఫూర్తి.. విపిఆర్

## - జిల్లా కలెక్టర్ ప్రశంస




జిల్లాలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అందిస్తున్న సామాజిక సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు అభినందించారు. ప్రతిఒక్కరూ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. నెల్లూరు సమీపంలోని కనుపర్తిపాడులో 'విపిఆర్ విద్య' పాఠశాల తొలి వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విపిఆర్ సేవలను ఆయన కొనియాడారు. విపిఆర్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కూడా విపిఆర్ లాగే కృషితో రాణించి సేవాభావంతో ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్పొరేట్ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు రాను రాను అగ్గిపెట్టెల్లాంటి చిన్న గదులతో ఇరుకుగా వుంటున్నాయని, పాఠశాలల్లో ఆటస్థలాలు కన్పించడం లేదని ఆయన విచారం వ్యక్తం చేస్తూ, అందుకు భిన్నంగా విపిఆర్ పాఠశాల ఎంతో విశాలమైన తరగతి గదులతో, క్రీడా మైదానంతో ఆహ్లాదంగా వుండడం ఎంతో సంతోషకర మన్నారు. విద్యార్థులు కష్టపడి ఉన్నత విద్యలో ప్రతిభాపాటవాలతో రాణించాలని, చదువే తనను మీ మధ్య కలెక్టర్‌గా మంచిస్థాయిలో నిలబడేట్టు చేసిందని విద్యార్థులనుద్దేశించి అన్నారు. బాగా చదువుకుంటే ఉన్నతస్థాయిలో రాణించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దాత, పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొని జిల్లా కలెక్టర్ తదితర ప్రముఖులను పాఠశాలలోకి స్వాగతించారు. అనంతరం, పాఠశాల కరస్పాండెంట్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, ఈ పాఠశాలను ఏర్పాటు చేయాలని వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఎంతోకాలంగా పరితపించేవారని, 2015లో ఆయన పుట్టినరోజు సందర్భంగా వచ్చిన ఈ ఆలోచన 2016 నాటికి ఆచరణలోకి వచ్చిందని, ఆ కల సాకారమైందన్నారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొ॥ వి.నారాయణరెడ్డి, విద్యా సంస్థల కరస్పాండెంట్లు మైథిలి మనోహర్‌రెడ్డి, ఎం.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రాజకీయాలలో ఒకరి క్రిందకు ఒకరు నీళ్ళు తెచ్చుకోవడం కామన్. అయితే అప్పుడప్పుడు కొందరు తమ చాపక్రిందకు తామే నీళ్ళు తెచ్చుకుంటుంటారు. ఈ బాపతు క్రిందకే వస్తాడు మంత్రి నారాయణ.**



# పట్టాభితో పరపతి 'ఢాం'

అలవిగాని చోట అధికులం అనకూడదనే సామెత తెలియంది కాదు. ఆ సామెత నారాయణకు వంటబట్టినట్లు లేదు. తనకు అలవాటు లేని రాజకీయాల జోలికి పోయి అనవసరంగా చేతులు కాల్చుకున్నాడు. అంతేకాదు, చంద్రబాబు వద్ద కూడా రాజకీయాలకు నారాయణ పనికిరాడులే అనే పేరు తెచ్చుకున్నాడు. దీనికంతటికీ కారణం మొన్నటి ఎమ్మెల్సీ ఎలక్షనే!

తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుండి నారాయణ పట్టుబట్టి నిలబెట్టిన తన అనుచరుడు వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి ఓడిపోయాడు. పట్టాభి స్థానంలో ఇంకెవరిని నిలబెట్టివున్నా పార్టీ కేడర్ చేసిన కృషికి గెలిచి వుండేవారనే ప్రచారం జరిగింది. పట్టాభి గెలవకపోవడంతో నారాయణ ఎలక్షన్లు చేయలేడనే పేరొచ్చింది. అంతేకాక 150ఓట్ల పైచిలుకు మెజార్టీ వస్తుందనుకున్న నెల్లూరుజిల్లా స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరగడం కూడా నారాయణకు మైనస్ అయ్యింది. అదే సమయంలో కడపజిల్లా ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన సోమిరెడ్డి అక్కడ పార్టీ అభ్యర్థి గెలుపుకు వ్యూహాలు పన్నడం, గెలుపు సాధించడంతో నెల్లూరుజిల్లా రాజకీయాలకు నారాయణ సెట్ కాడని, సోమిరెడ్డి పర్‌ఫెక్ట్ అని చంద్రబాబు నిర్ణయించుకున్నాడు.

# ముగిసిన మద్యం జాతర

జిల్లాలో 350 మద్యం దుకాణాలను లాటరీ ద్వారా కేటాయించే జాతరను ఎక్సైజ్ అధికారులు ముగించారు. జిల్లాలో 350 మద్యంషాపులకు 3,553 దరఖాస్తులు వచ్చాయి. మార్చి31వ తేదీన మద్యపానాన్ని వ్యతిరేకించిన పూజ్యబాపూజీ సతీమణి కస్తూరిబా పేరుతో నిర్మించివున్న కస్తూరిబా కళాక్షేత్రంలో మద్యంషాపులను కేటాయించే లాటరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీరియల్ ప్రకారం ఒక్కో షాప్‌కు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, లక్కీడిప్‌లో వచ్చిన దరఖాస్తుదారుడికి షాపును కేటాయించారు. జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ కొన్ని షాపులకు స్వయంగా లక్కీడిప్ తీసారు. షాపులు పొందినవాళ్ళు జూలై 1వ తేదీ నుండి మద్యం అమ్ముకోవచ్చు. వాస్తవంగా మార్చి 31వ తేదీనే ఇప్పుడున్న వారికి గడువు ముగిసినప్పటికీ, సుప్రీం కోర్టు ఆదేశాలతో మరో 3 నెలల గడువు పొడిగించారు.

ఇక క్రితంసారితో పోలిస్తే ఈ ఏడాది దరఖాస్తులు తక్కువ పడ్డాయి. దీనికి కారణం లైసెన్స్ ఫీజును బాగా తగ్గించినా దరఖాస్తు ఫీజును లక్ష రూపాయలుగా పెట్టడం. షాపు రాకుంటే ఆ లక్ష పోయినట్లే! అదీగాక దరఖాస్తులు తగ్గడంపై పెద్దనోట్ల రద్దు ప్రభావం కూడా బాగానే వుంది. చాలామందికి డబ్బులు దొరక్క దరఖాస్తులు వేయలేదు. మార్కెట్‌లో అధికవడ్డీలకు డబ్బు దొరికే పరిస్థితి కూడా లేకుండా పోయింది.

### వ్యాపారం బాగానే ఉండొచ్చు

ఎంఆర్‌పి రేట్లను ఈసారి ఖచ్చితంగా అమలు చేసేటట్లున్నారు. అందుకే లైసెన్స్ ఫీజులు తగ్గించారు. అదే సమయంలో పర్మిట్ రూంల ఫీజును మాత్రం భారీగా పెంచారు. ఇప్పుడు లైసెన్స్ వచ్చిన వ్యాపారులకు ఓ అదృష్టం ఏంటంటే 2019 ఎన్నికలవరకు కూడా వాళ్ళే వ్యాపారం చేస్తుంటారు. ఎన్నికల సమయంలో మద్యం వ్యాపారం ఏ స్థాయిలో వుంటుందో వేరే చెప్పనక్కరలేదు. కాబట్టి ఈసారి ఎంఆర్‌పి రేట్లను అమలు చేసినా మద్యం వ్యాపారాలకు పెద్దగా ఇబ్బంది ఉండదు.



**ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ఈ నెల 3వ తేదీ విజయవాడలోని ఆయన నివాసంలో కలిసి సత్కరిస్తున్న కర్నాటక తెలుగుదేశంపార్టీ సమన్వయకర్త రావి మోహన్ చౌదరి**

బీదలో..



# ఆశలు రేపారు.. ఆవిరి చేసారు

**మంత్రివర్గ విస్తరణ సమయంలో బి.సి కోటా నుండి జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేరు అనూహ్యంగా తెరమీదకు రావడం తెలిసిందే! ఒక దశలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని శాసనమండలి ఛైర్మన్‌గా పంపించి బీద రవిచంద్రను మంత్రిని చేయనున్నారనే ప్రచారం కూడా నడిచింది.**

మంత్రివర్గ విస్తరణ అంటూ జరిగితే జిల్లా నుండి చోటు ఖాయం అని అనుకుంటున్న పేరు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. ఎందుకంటే జిల్లా నుండి పి.నారాయణ మంత్రిగా వున్నప్పటికీ జిల్లాలో ఎవరూ ఆయనను మంత్రిగా ఫీల్ కావడం లేదు. అందుకని పార్టీ కేడర్ అంతా కూడా సోమిరెడ్డినే మంత్రిగా కోరుకుంటూ వచ్చింది. సోమిరెడ్డిని కాదని తనకు మంత్రిపదవి ఇస్తారని బీద రవిచంద్ర కూడా ఎప్పుడూ ఆశలు పెట్టుకోలేదు.

గత కొన్ని దశాబ్దాల నెల్లూరు రాజకీయ చరిత్రను పరిశీలిస్తే రాష్ట్రంలో ప్రభుత్వం ఏదున్నా, ముఖ్యమంత్రిగా ఎవరున్నా ఈ జిల్లాలో 'రెడ్డి' వర్గానికి చెందిన మంత్రి లేకుండా లేదు. తొలిసారిగా ఈ ప్రభుత్వంలోనే మూడేళ్లపాటు రెడ్డి వర్గం నుండి మంత్రి లేకుండా నడిచింది. రాష్ట్రంలో 'రెడ్ల' ఆధిపత్యం బలంగా వున్న జిల్లాలలో కడప, కర్నూలు తర్వాత నెల్లూరే ప్రముఖంగా ఉంటుంది. ఈ జిల్లాలో రాజకీయంగా నెట్టుకు రావాలంటే ఆ వర్గానికి చెందిన వారిని మంత్రివర్గంలోకి తీసుకోక తప్పదు. ఏ జిల్లాలో పరిస్థితి ఏంటనేది తెలిసినవాడు కాబట్టే రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 'రెడ్డి' వర్గం నుండి ఒకరిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని చంద్రబాబు నిర్ణయించారు.

అయితే నారాయణకు రాజకీయ ఓనమాలు తెలియవు. చంద్రబాబు వద్ద తన మాట చెల్లుబాటవుతుంది కాబట్టి సోమిరెడ్డిని మంత్రి కాకుండా అడ్డుకోవాలనుకున్నాడు. అదీగాక సోమిరెడ్డి మంత్రయితే నారాయణ మంత్రిగా నెల్లూరుకు కూడా రాబల్లేడు. సోమిరెడ్డి మంత్రయితే తన పరిస్థితి ఎలా ఉంటుందో తెలుసుకాబట్టే నారాయణ ఆయనకు చెక్ పెట్టడానికి బీద రవిచంద్రను కలబెట్టాడు. బి.సి కోటా అంటూ ఆయన పేరు తెరమీదకు తెచ్చాడు. రవిచంద్రలో ఆశలు మొలకెత్తించాడు. చివరి వరకు ఆయనను టెన్షన్‌లో పెట్టాడు. కాని చంద్రబాబు నెల్లూరు రాజకీయాల గురించి లోతుగా తెలిసినోడు. ఇక్కడ పార్టీకి సోమిరెడ్డి అవసరం ఎంతుందో తెలిసినవాడు. అందుకే నారాయణ ఎన్ని అడ్డుపుల్లలు వేసినా సోమిరెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకున్నాడు. కాకపోతే నారాయణే... తన స్వార్థానికి రవిచంద్రలో లేనిపోని ఆశలు రేపి చివరకు ఉసూరుమనిపించారు.



## నెల్లూరు కార్పొరేషన్‌కు...

# కాగ్ అక్షింతలు

నెల్లూరు కార్పొరేషన్ ఎంత దరిద్రంగా ఉందన్నది ఇంతవరకు నెల్లూరీయులకు మాత్రమే తెలిసిన రహస్యమనుకున్నాం. కాని దీని ఘనత ఢిల్లీ దాకా పాకిందన్న విషయం మొన్ననే బయటపడింది. ఆధునిక కాలానికనుగుణంగా మారడంలో నెల్లూరు కార్పొరేషన్ వెనుకబడిందంటూ 'కాగ్' అక్షింతలు వేసింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంలోనూ, తడి, పొడి చెత్త సేకరణలోనూ నెల్లూరు కార్పొరేషన్ విఫలమైందంటూ 'కాగ్' దుయ్యబట్టింది. కార్పొరేషన్ పరిధిలో పెండింగ్‌లో వున్న 5.10కోట్ల కరెంట్ బిల్లుల విషయాన్ని కూడా 'కాగ్' ప్రస్తావించింది. అయితే 'కాగ్' నెల్లూరు కార్పొరేషన్‌ను ఒక వైపే చూసింది. రెండో వైపు చూసుంటే దండకాలను ఎన్ని రూపాలలో చేయొచ్చో, దందాలను ఏ విధంగా చేయవచ్చో తెలిసుండేది. ఆ ప్రతిభను గుర్తించి వుంటే 'కాగ్' ఖచ్చితంగా అవినీతి వసూళ్లలో నెల్లూరు కార్పొరేషన్ అభివృద్ధిని మెచ్చుకుని ఉండేది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# నెల్లూరు కబుర్లు

## అక్రమ వసూళ్ళలో ముందు...

# అసలు వసూళ్ళలో వెనుక

### ● నెల్లూరు కార్పొరేషన్ తీరిది

మున్సిపల్ మంత్రి నారాయణ సొంత కార్పొరేషన్ నెల్లూరు. ఆయన పనితీరు లాగానే నెల్లూరు కార్పొరేషన్ పనితీరు కూడా వుంది. లంచాల వసూళ్లలో రాష్ట్రంలోనే నెల్లూరు కార్పొరేషన్ ప్రథమ స్థానంలో ఉంటోంది. అక్రమాలు, అవినీతి వసూళ్ల పెరిగాయి కాబట్టి కార్పొరేషన్‌లో అసలైన పన్ను వసూళ్ళు తగ్గాయి. 2016 ఏప్రిల్ 1 నుండి 2017 మార్చి 31వ తేదీ వరకు నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో లక్షా 38 వేల అసెస్‌మెంట్లకు 101.69కోట్ల రూపాయల పన్ను వసూలు కావాల్సి వుండగా కేవలం 30.55కోట్లు మాత్రమే వసూలయ్యాయి. 71.14 కోట్ల రూపాయల పన్ను బకాయిలు పెండింగ్‌లో వున్నాయి. పన్నుల వసూళ్లలో నెల్లూరు రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచింది.

# షోరూమ్‌లు కిటకిట




బిఎస్-3 ద్విచక్ర వాహనాలపై భారీ డిస్కొంట్లు ప్రకటించడంతో మార్చి 31వ తేదీన నెల్లూరులోని అన్ని ద్విచక్రవాహనాల షోరూమ్‌లలో కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. స్కూటర్‌లు, బైక్‌లు కొనడానికి జనం ఎగబడ్డారు. బిఎస్-3 వాహనాలను మార్చి 31 తర్వాత అమ్మకూడదని సుప్రీంకోర్టు ఆదేశించడం తెలిసిందే! దీంతో అన్ని మోటార్ కంపెనీలు తమ బిఎస్-3 వాహనాల అమ్మకాలకు 3వేల నుండి 22వేల రూపాయల వరకు డిస్కొంట్లు ప్రకటించాయి. దీంతో కొనుగోలుదారులు షోరూమ్‌లకు భారీగా చేరుకున్నారు. షోరూమ్‌లలో పని చేస్తున్న సిబ్బందే తమ బంధుమిత్రులకు ఎక్కువ వాహనాలను సర్దేసారు. అన్ని షోరూమ్‌లలోనూ 31వ తేదీ మధ్యాహ్నానికే బిఎస్-3 వాహనాలను ఊడ్చేసారు. చాలామంది వాహనాలు దొరక్క నిరాశతో వెనుదిరిగారు.

# ఏసి వాకర్స్ ఉగాది, శ్రీరామనవమి వేడుకలు



నెల్లూరు ఏసి స్టేడియంలో ఏసి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది, శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉగాది సందర్భంగా ఆలూరి శిరోమణిశర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. పండుగ సందర్భంగా వాకర్స్‌కు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన వాకర్స్‌కు వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు చెలికాని సీతారామయ్య చేతులమీదుగా బహుమతి ప్రదానం జరిగింది. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా విశేషపూజల అనంతరం వాకర్స్‌కు పానకం, వడపప్పు, గుగ్గిళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ అధ్యక్షుడు వేలూరు రంగారావు మాట్లాడుతూ ఈ సంవత్సరం వాకర్స్ వారి కుటుంబసభ్యులు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో తులతూగాలని కోరారు. ఈ కార్యక్రమాలలో కార్యదర్శి స్వర్ణ రమేష్, పొన్నం రవిచంద్ర, వేణుగోపాల్, సత్యనారాయణరావు, రామానాయుడు, రవిచంద్ర, ఎం.వి.సుబ్బారెడ్డి, మైథిలి మనోహర్‌రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, డా॥ అంకిరెడ్డి, దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, ఎస్.రాఘవేంద్రశెట్టి, ఓబులరెడ్డి, నారాయణరావు, హరిరావు, కె.యం.రెడ్డి, షణ్ముకరామ్, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాయిదర్బార్‌లో రక్తదాన శిబిరం



నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల సాయిబాబా మందిరంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని మందిర ఛైర్మెన్ మధుసాయి ప్రారంభించారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువతను ఆయన అభినందించారు. బాబా ప్రసాదాలను రక్తదాలకు అందజేశారు.

### ● బాబు నైజం తెలిసిందా?

# పేరే లేని మాగుంట!



మొన్న జరిగిన మంత్రివర్గ విస్తరణలో చాలామంది ఎమ్మెల్యేల పేర్లు పరిశీలనలోకి వచ్చాయి. వారిలో కొద్దిమందికి మంత్రి పదవులొచ్చాయి కూడా! అయితే ప్రకాశం జిల్లా నుండి ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేరు అసలు పరిశీలనలోకి కూడా రాకపోవడం శోచనీయం. ఎందుకంటే ఇక్కడ మంత్రి పదవి అడిగే పొజిషన్‌లో శ్రీనివాసులురెడ్డి లేకున్నా ఇస్తానని చెప్పిన మాట నిలబెట్టుకోవాల్సిన బాధ్యత చంద్రబాబుది. కాకపోతే మాటను నిలబెట్టుకునే నైజం ఎలాగూ లేదు కాబట్టి మాగుంట శీనయ్య పేరును పరిశీలనలోకి కూడా తీసుకోలేదు.

అసలు మాగుంట శీనయ్యకు మంత్రి పదవి ఆలోచన కూడా లేదు. 2014లో ఒంగోలు ఎంపీగా ఓడిపోయిన ఆయనను ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి పోటీ పెట్టింది చంద్రబాబే! మాగుంట శీనయ్యకు ఎమ్మెల్సీ చిన్నపదవి. కాకపోతే ఆరోజున పరిస్థితుల్లో మాగుంట అయితే సులభంగా గెలవచ్చని చంద్రబాబు ప్లాన్ వేసి దించాడు. ఒట్టి ఎమ్మెల్సీ అయితే బాగుండదనిచెప్పి మంత్రివర్గంలోకి కూడా తీసుకుంటానని హామీ ఇచ్చాడు. అనుకున్నట్లే శీనయ్య ఎమ్మెల్సీగా గెలిచాడు. రెండేళ్ళ నుండి మంత్రివర్గ విస్తరణ వాయిదాపడుతూ వస్తుంది. ఎట్టకేలకు ఇప్పుడు జరిగింది. నాకు ఈ పదవి కావాలి అని అడగడం మాగుంటోళ్లకు అలవాటు లేదు. అడగకుండా ఇచ్చే అలవాటు చంద్రబాబుకు లేదు. గతంలో హామీ ఇచ్చి వున్నారు కదా అని మాగుంట శీనయ్య చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చివుంటే పరిస్థితి వేరుగా ఉండేది. కాని చంద్రబాబు పిలిచి ఇస్తే మంత్రి పదవిని స్వీకరిద్దాంలే అన్నట్లు మాగుంట శీనయ్య వుండిపోయాడు. అడిగినోళ్లకే సర్దలేక చస్తున్నాం, అడగని ఆయనను కలబెట్టడం ఎందుకులే... అదీగాక మంత్రివర్గంలోకి తీసుకుంటానని గతంలో నేనిచ్చిన హామీని ఆయన మరచిపోయి వుంటాడనుకుని చంద్రబాబు ఆయన పేరును పరిశీలనలోకి కూడా తీసుకోలేదు.

# 'మీ-సేవ'లాగా.. ఇక 'పుర సేవ'

## - కొత్త కమిషనర్ ఢిల్లీరావు



నగరపాలక సంస్థ సేవలు నగరంలోని అన్నిప్రాంతాల ప్రజలకు అందేవిధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, 'మీ-సేవ' కేంద్రాల వలనే త్వరలో పురసేవ కేంద్రాలను కూడా ఏర్పాటుచేసి తద్వారా నగరపాలక సేవలు మరింతగా విస్తరిస్తామని నెల్లూరు కార్పొరేషన్ కొత్త కమిషనర్ ఢిల్లీరావు చెప్పారు. గతనెల 31న ఆయన నెల్లూరు నగరపాలక కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, కార్యాలయంలో దళారీ వ్యవస్థను నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకుంటానన్నారు. ప్రతిరోజు అన్ని డివిజన్‌లలో పర్యటించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## రాజరాజేశ్వరి అమ్మవారి సేవలో

# హైకోర్టు న్యాయమూర్తి

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాన్ని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరరావు దంపతులు సందర్శించారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు రాజరాజేశ్వరి అమ్మవారికి, సుందరేశ్వరస్వామికి, గాయత్రి అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ రత్నం జయరామ్, ఇ.ఓ, సహాయ కమిషనర్ కోదండరామిరెడ్డి, శ్రీరాజరాజేశ్వరి సేవా సమితి అధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'గీతామయి'లో

# వృద్ధులకు వైద్యసేవలు

నెల్లూరులోని బాలాజీనగర్‌లో వున్న గీతామయి వృద్ధాశ్రమంలో ఆదివారం ఉచిత షుగర్‌వ్యాధి శిబిరం నిర్వహించారు. డాక్టర్ మాధవ్ పావులూరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వృద్ధులకు షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వృద్ధులకు సేవచేయడం తనకెంతో ఆనందంగా వుందని, ఇక్కడ ప్రతిఏటా రెండుసార్లు ఈ శిబిరం నిర్వహించి వృద్ధులకు అవసరమైన మందులు పంపిణీ చేస్తామని ఆయన ఈ సందర్భంగా అన్నారు.

# గంగిశెట్టికి బాలసాహిత్య పురస్కారం




నెల్లూరు నగరానికి చెందిన బాలసాహితీవేత్త గంగిశెట్టి శివకుమార్ పార్వతీపురానికి చెందిన మంచిపల్లి సత్యవతి రాష్ట్ర స్థాయి బాలసాహిత్య పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. పార్వతీపురంలోని లయన్స్ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు గొల్లపూడి మారుతీరావు, సంస్థ ప్రధాన కార్యదర్శి మంచిపల్లి శ్రీరాములు, మాజీఎంపి డాక్టర్ డి.వి.జి.శంకరరావుల చేతులమీదుగా స్వీకరించారు. ఈ సందర్భంగా 'బాలసాహితీభూషణ్' అవార్డుతో పాటు రూ.5వేల నగదును గంగిశెట్టి శివకుమార్‌కు బహుకరించి, ఆ దంపతులను ముఖ్యఅతిథులు ఘనంగా సత్కరించారు. ప్రముఖ రచయిత జియో లక్ష్మణ్, బాల సాహితీవేత్త నాదంశెట్టి ఉమామహేశ్వరరావు, పలువురు ప్రముఖులు, కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

# పల్స్‌పోలియో విజయవంతం



రెండవ విడత పల్స్‌పోలియో విజయవంతమైంది. ఆదివారం నెల్లూరు నగరంలో వాడవాడలా పల్స్‌పోలియోను ఐదేళ్ళలోపు చిన్నారులకు వేశారు. పోలియోబూత్‌ల వద్ద స్వచ్ఛంధ సంస్థల సభ్యులు, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, ఐసిడిఎస్, జిల్లా వైద్యశాఖ సిబ్బంది సహకరించారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్, ముత్తుకూరు బస్టాండ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, రోటరీ క్లబ్, తదితర ప్రాంతాల్లో పోలియో చుక్కలబూత్‌లను ఏర్పాటు చేశారు. స్టోన్‌హౌస్‌పేట, తడికలబజార్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వీధి విక్రయదారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం జరిగింది. వైయస్సార్‌నగర్‌లో ఏర్పాటుచేసిన పల్స్‌పోలియో కార్యక్రమంలో స్వచ్ఛంధ సంస్థల నాయకులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

# అభివృద్ధికి నెల్లూరు సింహద్వారం

## సొంత జిల్లా ప్రగతిపై ప్రత్యేకదృష్టి పెట్టిన కేంద్రమంత్రి వెంకయ్య

మాతృభాషలోని తియ్యదనాన్ని, మాతృ భూమిలోని గొప్పదనాన్ని ప్రపంచం నలు మూలలా ఎంతో అద్భుతంగా వివరించి, కరుడుగట్టిన స్వార్థపరుల్లో సైతం జన్మ భూమి ఋణం తీర్చుకోవాలన్న ఆలోచన తెప్పించే కేంద్రమంత్రి, మన నెల్లూరీయుడు యం.వెంకయ్యనాయుడు నెల్లూరుజిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. 1999-2004ల మధ్యకాలంలో కేంద్ర మంత్రిగా ప్రధాని, ఉపప్రధానిలతో సహా 38మంది కేంద్రమంత్రులను నెల్లూరుకు రప్పించి ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన వెంకయ్య, ఇప్పుడు కూడా అదే ఒరవడి కొనసాగిస్తున్నారు. పరోక్షంగా స్వర్ణభారత్ ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్‌ల ద్వారా జిల్లా ప్రజలకు విద్య, వైద్య, ఉపాధి రంగాలలో సేవలందిస్తున్న ఆయన ఈ జిల్లా అభివృద్ధి కోసం 'నెల్లూరు నెక్స్ట్' అనే పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం తెలిసిందే! ఈ అభివృద్ధి ప్రక్రియను మరింత ఊపు, ఉత్సాహంతో ముందుకు కదిలించే విధంగా మార్చి31, ఏప్రిల్ 1వ తేదీలలో జిల్లాలో ఆయన పర్యటన సాగింది. ఈ రెండురోజుల్లోనూ జిల్లా అభివృద్ధికి సరికొత్త బాటలు వేసే విధంగా కార్యక్రమాలు జరిగాయి. మార్చి 31వ తేదీన పెద్దాసుపత్రి ప్రాంగణంలో 98.75 కోట్లతో కట్టిన సర్వజన ఆసుపత్రి కొత్త భవనాలను ఆయన ప్రారంభించారు. మొగళ్ళపాలెం వద్ద 12కోట్లతో నిర్మించనున్న ఇండోర్ స్టేడియంకు, తెలుగుగంగ కాలనీ వద్ద 10కోట్ల ఖర్చుతో ఏర్పాటు చేయనున్న ఎఫ్‌ఎం రేడియో స్టేషన్‌కు ఆయన శంకుస్థాపన చేసారు. అలాగే రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో స్వర్ణభారత్ ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ఉచిత కంటి, దంత ఆసుపత్రులను, వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాన్ని, గ్రంథాలయాన్ని ప్రారంభించారు.






ఇక ఏప్రిల్ 1వ తేదీ నెల్లూరు ఏసి స్టేడియంలో నిర్వహించిన 'డిజిధన్ మేళా'లో ఆయన పాల్గొన్నారు. భారత్‌ను నగదురహిత దేశంగా మారిస్తే అవినీతిని, నల్లధనాన్ని పూర్తిగా అరికట్టవచ్చంటూ ఆయన పిలుపునిచ్చారు. దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న నల్లధనాన్ని అరికట్టేందుకే పెద్దనోట్ల రద్దు వంటి సాహసోపేత నిర్ణయాన్ని తీసుకోవడం జరిగిందన్నారు. నల్లధనాన్ని అరికట్టేందుకు ప్రధాని నరేంద్రమోడీ తీసుకుంటున్న చర్యలతో నల్లకుబేరుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని వెంకయ్య పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం తర్వాత వెంకటాచలంలో 'రుర్బన్ మిషన్'కు ఆయన శంకుస్థాపన చేసారు. పట్టణాలకు గ్రామాలకు మధ్య అంతరాలను తగ్గించేందుకు దేశ వ్యాప్తంగా 300 మండలాలలోని గ్రామాలను రుర్బన్‌మిషన్ క్రింద అభివృద్ధి చేయాలని ప్రధాని నిర్ణయించారని, మన రాష్ట్రంలో ఈ మిషన్ క్రింద మూడు మండలాలను ఎంపిక చేయగా, అందులో వెంకటాచలం మండలాన్ని తాను స్వయంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమాలలో మంత్రి కామినేని శ్రీనివాస్, నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, తిరుపతి ఎంపి వరప్రసాద్, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్సీ, ప్రస్తుతం మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు మేయర్ అజీజ్, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి జానకి, జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు తదితరులు పాల్గొన్నారు.







# పుణ్య సంస్మరణ

మాన్యుడు, మరపురాని నేత

## శ్రీ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి గారు

కీర్తిశేషులై ఏప్రిల్ 6వ తేదీకి 34 సంవత్సరాలు గడిచిన సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...

వారి పవిత్రాత్మకు భక్త్యంజలి ఘటిస్తున్నాము.

కుమారుడు - కోడలు: **సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - జ్యోతి**
వ్యవసాయ, హార్టికల్చర్, సెరీకల్చర్, అగ్రిప్రాసెసింగ్ శాఖామాత్యులు

కుమార్తెలు - అల్లుళ్ళు
కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి
కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు | మనుమరాండ్రు |
|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | శ్రుతి |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | లక్ష్మీఐషిత |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | డా॥ సింధు |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | నీలిమ |
| యల్లా సనత్‌రెడ్డి | షాలిని |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | డా॥ మాలిని |
| కేతిరెడ్డి శశధర్‌రెడ్డి | కీర్తి |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | స్నిగ్ధ |

| మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|
| యల్లా శర్విన్ | యల్లా సంజన |
| కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ |

# జిల్లాలో వలసలు తగ్గాయి

## - కలెక్టర్ ముత్యాలరాజు



నెల్లూరుజిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం బాగా అమలు చేయడం వల్ల జిల్లా నుండి ఇతర ప్రాంతాలకు వలసలు తగ్గాయని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్లో జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలు గురించి, లక్ష్యసాధన గురించి విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2016–17 ఆర్థిక సంవత్సరానికి ఒక కోటి 25లక్షల61వేల పని దినాలు కల్పించడం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 1కోటి 28లక్షల 28వేల పనిదినాలు కల్పించి ఉపాధి కల్పించడంలో రాష్ట్రంలోనే నెల్లూరుజిల్లా మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. అదేవిధంగా 2016–17 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధిహామీ పథకం క్రింద 406కోట్ల 14లక్షల రూపాయలు ఖర్చు చేయడం లక్ష్యం కాగా, జిల్లాలో 343కోట్ల 37లక్షల రూపాయలు ఖర్చుచేసి రాష్ట్రంలో 3వ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. 343కోట్ల 37లక్షల రూపాయలలో వేతనాల రూపం క్రింద 170కోట్ల 25 లక్షల రూపాయలు ఖర్చు చేయగా, మెటీరియల్ కాంపొనెంట్ క్రింద 154కోట్ల 3లక్షలు రూపాయలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఇదే ఆర్థిక సంవత్సరంలో 40వేల కుటుంబాలకు 100రోజుల పని దినాలు కల్పించడం లక్ష్యంకాగా, జిల్లాలో 45వేల 761కుటుంబాలకు 100రోజుల పనిదినాలు కల్పించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. వర్మికంపోస్టు గురించి కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ పథకం క్రింద 15వేల కంపోస్టు యూనిట్లు ఏర్పాటు చేయడం లక్ష్యం కాగా, జిల్లాలో 10,667 కంపోస్ట్ యూనిట్లు పూర్తి చేసి రాష్ట్రంలో 4వ స్థానంలో వున్నారు. రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమంలో కూడా రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో ఉందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు సంబంధించిన భూముల్లో 2వేల ఎకరాల్లో పండ్లతోటల పెంపకం లక్ష్యం కాగా, 2,491 ఎకరాలలో పండ్ల తోటల పెంపకం చేపట్టి రాష్ట్ర స్థాయిలోనే ఈ విభాగంలో నెల్లూరు జిల్లా ప్రథమస్థానం ఆక్రమించిందన్నారు. అదేవిధంగా చంద్రన్నబాట కార్యక్రమంలో 400కి.మీ సిమెంట్‌రోడ్ల నిర్మాణం లక్ష్యం కాగా జిల్లాలో 403కి.మి లక్ష్యం సాధించి రాష్ట్రంలోనే ఈ విభాగంలో కూడా మొదటిస్థానం సాధించిందన్నారు. 2016–17 సంవత్సరంలో ఉపాధి నిధుల అనుసంధానంతో 371 అంగన్‌వాడి కేంద్రాలను నిర్మించాలని జిల్లా యంత్రాంగం లక్ష్యం కాగా, ఇప్పటివరకు 287 అంగన్‌వాడి కేంద్రాలు పురోగతిలో వుండగా, 96 అంగన్‌వాడి కేంద్రాలు పూర్తి అయ్యాయన్నారు. దీనిక్రింద జిల్లాలో 3కోట్ల 30లక్షల రూపాయలు ఖర్చుచేసి రాష్ట్రంలోనే నెల్లూరుజిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఉపాధిహామీ నిధులతో 600శ్మశానవాటికలను అభివృద్ధి చేయడానికి లక్ష్యం కాగా 528 శ్మశాన వాటికల్లో పనులు జరుగుతున్నాయన్నారు. ఉపాధి హామీ నిధులతో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకంను విస్తరింపజేసి 90రోజుల పని దినాలను గృహనిర్మాణాలకు కేటాయిస్తూ ఇప్పటివరకు మంజూరైన 9163 ఇండ్లకు 2645 ఇళ్ళు పురోగతిలో వున్నాయన్నారు. ఉపాధిహామీ పథకంలో ఎవరైనా అవకతవకలు చేసినట్లు రుజువైతే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో జాతీయ ఉపాధిహామీ పథకం క్రింద వివిధ విభాగాలలో మొదటిస్థానం సాధించడానికి కృషి చేసిన సిబ్బందిని, ఫీల్డ్ సహాయకులను కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో డ్వామా పిడి హరిత తదితరులు పాల్గొన్నారు.

# ఆటిజంపై అవగాహన పెంచుకోవాలి

## - జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్




ఆటిజం వ్యాధిపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ పేర్కొన్నారు. వరల్డ్ ఆటిజండేను పురస్కరించుకుని వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ అండ్ రీసర్చి సెంటర్ ఆధ్వర్యంలో నేషనల్ ట్రస్ట్ సహకారంతో ఆదివారం నెల్లూరు టౌన్‌హాలులో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆటిజం అంటే వ్యాధి కాదని, మానసిక రుగ్మతని అన్నారు. వైద్యశాస్త్రం నానాటికి అభివృద్ధి చెందుతున్నప్పటికి శిశువుల్లో కొత్త కొత్త వ్యాధులు, రుగ్మతలు సంభవించడం బాధాకరమన్నారు. ప్రముఖ పల్మనాలజిస్ట్ మేజర్ డా॥ నాగరాజు ఆటిజంపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలియజేశారు. నెల్లూరునగర డిఎస్పీ జి.వి.రాముడు మాట్లాడుతూ ఆటిజంపై అవగాహన కల్పించడంలో వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ సేవలను అభినందించారు. అనంతరం ప్రముఖ చిన్నపిల్లల ఊపిరితిత్తుల వ్యాధి నిపుణులు డాక్టర్ మేజర్ నాగరాజును వైద్యరత్న బిరుదుతో శాలువ, పూలమాల, సన్మానపత్రంతో ముఖ్యఅతిథులు సత్కరించారు.

ఈ కార్యక్రమానికి ముందు ర్యాలీ నిర్వహించారు. ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆటిజంపై అవగాహన కల్పించే గోడపత్రికలను విడుదల చేశారు. మెప్మా పి.డి చిరంజీవి, వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డా॥ టి.వసంతలక్ష్మి, రిచ్ ఆసుపత్రి అధినేత డాక్టర్ టి.రవికుమార్, డాక్టర్ శ్రీనాథ్, స్వచ్ఛంధ సంస్థల జిల్లా అధ్యక్షుడు ఇ.వి.యస్.నాయుడు, జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

# మహిళల ఉపాధితోనే ఆర్థికాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న వై.స్నేహలతారెడ్డి, పక్కన డాక్టర్ సి.రోహిణి, సౌందర్యమ్మ తదితరులు

మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా ఉపాధి మార్గం ఎంచుకుని చేతి వృత్తుల ఆధారంగా ముందుకుసాగితే ఆర్థికాభివృద్ధి సాధిస్తారని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షులు డాక్టర్ సి.రోహిణి, ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆంధ్ర మహిళామండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత కుట్లుఅల్లికల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం మండలి అధ్యక్షురాలు సౌందర్యమ్మ, డాక్టర్ సి.రోహిణి, వై.స్నేహలతారెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ఉగాది సందర్భంగా గూడూరులో పంచాంగశ్రవణం జరుపుతున్న శ్రీమాన్ ఆలూరు శిరోమణిశర్మ, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు

# తాగునీటి ఇబ్బందులు తీరుస్తాం...

## - ఛైర్‌పర్సన్ దేవసేన



గూడూరు పురపాలక సంఘ పరిధిలో తాగునీటి సమస్య లేకుండా చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. గూడూరు సమీపంలోని వేములపాళెం వాటర్ వర్క్సు కండలేరు జలాశయం నుంచి వచ్చే పైపులు పగిలిపోవడంతో పరిశీలించేందుకు ఆమె వెళ్లారు. ఈ క్రమంలో కండలేరు జలాశయం వద్ద నుంచి గూడూరు పట్టణానికి పంపింగ్ చేస్తున్న మంచినీటి పథకాన్ని చూశారు. సమీపంలో తాగునీటి పైపులు ధ్వంసమైన ప్రదేశాన్ని పరిశీలించి తక్షణం మరమ్మతులు చేసి తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు చేపట్టారు. గూడూరు పట్టణానికి కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో ఛైర్‌పర్సన్‌తో పాటు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్ పైప్‌లైన్లను పరిశీలించారు.

# వైద్యసేవలు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న పరసా రత్నం

ప్రభుత్వ వైద్యులుగా ఎంతోమంది పేదల జీవితాలలో వెలుగు నింపడం సంతోషకరమని మాజీమంత్రి పరసా రత్నం అన్నారు. గూడూరు పట్టణంలోని ద్వారకామయి సమావేశ మందిరంలో గూడూరు ప్రభుత్వ ఆసుపత్రి కంటి వైద్యులు డాక్టర్ గోపీనాథ్ పదవీ విరమణ, ఆత్మీయ అభినందన సభను రోటరీక్లబ్ గూడూరు వెస్ట్, ప్రాంతీయ వైద్యశాల సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరికో కంటి వైద్యం చేసి వారి జీవితాలలో వెలుగు నింపిన ఘనత డాక్టర్ గోపీనాథ్‌కే దక్కుతుందని తెలిపారు. వృత్తినే దైవంగా భావించి పేదలకు సేవలు చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు నెలవల సుబ్రహ్మణ్యం, వెస్ట్ రోటరీక్లబ్ అధ్యక్షులు శ్రీనివాసులు, గవర్నర్ మునిగిరీష్, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, సోమిశెట్టి చెంచురామయ్య, సుబ్బారావు, క్రిష్ణయ్య, డి.వి.సుబ్రహ్మణ్యం, ఉమ, ఆర్‌ఎంవో శైలజ, ఎన్.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సర్వత్రా సంతోషం

తెలుగుదేశంపార్టీ జిల్లా సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి మంత్రి పదవి రావడం ఆనందంగా వుందని తెలుగుదేశం పార్టీలో విధేయులకు పట్టం కట్టడం సంతోషకరమని గూడూరు పురపాలక అధ్యక్షురాలు పొనకా దేవసేన అన్నారు. గూడూరు పట్టణంలోని నంగం సినిమాహాలు సెంటర్, గడియారపు స్థంభం కూడలి వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి స్వీట్లు పంచి, బాణాసంచా కాల్చి ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేస్తే గుర్తింపు ఖచ్చితంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, తెలుగుదేశం నాయకులు మనపాటి రవీంద్రబాబు, శ్రీనివాసులు, సురేష్, కోదండరామయ్య, శ్రీధర్, తెలుగుదేశం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిందితులను అరెస్ట్ చేయాలి

గూడూరు సమీపంలోని ఓ కళాశాలలో విద్యార్థినులు పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితులను తక్షణం అరెస్టు చేయాలని పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్ ఆధ్వర్యంలో గూడూరు ఇన్‌ఛార్జి డిఎస్పీ శ్రీనివాసాచారికి మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు శివశంకర్, అనీల్‌కుమార్, ఉమర్, శివ, బాలు, గోపి పాల్గొన్నారు.

# మంత్రుల ఎంపికకు ఇంటర్వ్యూలు

గర్విక

ప్రపంచంలోని మేటి సిటీలన్నింటిని మిక్సీలో వేసి గ్రైండ్‌చేసి తీస్తే వచ్చిన అమరావతి రాజధాని నగరం. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం. చంద్రబాబుతో పాటు కోడెల శివప్రసాదరావు, యనమల రామకృష్ణుడు, పి.నారాయణ వున్నారు. మంత్రివర్గ విస్తరణపై చంద్రబాబు కసరత్తు మొదలుపెట్టాడు. చంద్రబాబు వుండి వారితో... ప్రభుత్వంలో ఇప్పటికే తెలుగుదేశం, బీజేపీ మంత్రులున్నారు. ఇప్పుడు వైకాపాకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలను మంత్రివర్గంలోకి తీసుకోబోతున్నాం... అయినా ఇంకా ఏదో లోటనిపిస్తుందన్నారు. ఏం కొరతగా వుందని యనమల అడిగాడు. సీపీఎం, సీపీఐలకు చెందిన ఎమ్మెల్యేలు కూడా ఉండుంటే మంత్రివర్గంలో అన్ని కులాలకని కాకుండా అన్ని పార్టీలకు కూడా సమన్యాయం చేసినట్లుండేదన్నాడు. అందుకు కోడెల... ఇప్పుడు మాత్రం మునిగిపోయిందేముంది... ఆ పార్టీకి చెందిన నాయకులను కూడా ఎమ్మెల్సీలను చేసి మంత్రివర్గంలోకి తీసుకుందాం... అని ప్రతిపాదించాడు. ఇప్పుడు టైం లేదు, ఈ ఆలోచన ముందే వచ్చుండుంటే అదే పని చేసి ఉండేవాణ్ణి. ముందుగా కొత్తవాళ్ళకు మంత్రి పదవులు ఇవ్వాలంటే, ఇప్పుడున్న వాళ్ళలో కొందర్ని తీసేయాలి. తీసేయాలనుకున్న మంత్రులకు, చేర్చుకోవాలనుకున్న వారికి ఇంటర్వ్యూలు, సామర్థ్య పరీక్షలు నిర్వహిద్దాం. తర్వాత ప్రతిభ ఆధారంగానే మంత్రి పదవులు ఇచ్చామని చెప్పుకోవడానికి బాగుంటుందని చంద్రబాబు చెప్పాడు. మంత్రి పదవులకు కూడా ఇంటర్వ్యూలు, సామర్థ్య పరీక్షలు... దేశంలోనే ఇది తొలిప్రయోగం. దీనిని ప్రవేశపెట్టిన తొలి ముఖ్యమంత్రిగా మీరు చరిత్రలో నిలిచిపోతారని కోడెల పొగిడాడు. ఇక పరీక్షలు మొదలుపెడదామని చెప్పి తీసేయాలనుకున్నవారి జాబితాలో నుండి మొదట బొజ్జల గోపాలకృష్ణారెడ్డిని పిలిచారు. 20అడుగుల ఎత్తులో హైజంప్ పోల్‌ను ఏర్పాటు చేసి ఒకే ఒక ప్రయత్నంలో దానిని దూకితేనే మంత్రి పదవి ఉంటుందని, లేకుంటే ఆరోగ్యంగా ఫిట్‌గా లేవు కాబట్టి తొలగించాల్సి వుంటుందని కండీషన్ పెట్టారు. వీళ్ళు ఆశించినట్లే బొజ్జల దూకలేకపోయాడు. తర్వాత రావెల కిషోర్ బాబును పిలిచారు. కష్టమైన ప్రశ్న ఒకటి వేయమంటావా? సులభమైన ప్రశ్నలు అయిదు అడగమంటారా? అని చంద్రబాబు అడిగాడు. కష్టమైన క్వశ్చన్ ఒకటి వేయండి చిటికెలో జవాబు చెప్పేస్తాను అని రావెల కిషోర్‌బాబు ఆత్మవిశ్వాసంతో చెప్పాడు. వెంటనే నారాయణ క్వశ్చన్ వేసాడు. విజయవాడ నుండి నెల్లూరుకు మధ్య దూరమెంత, మిల్లీమీటర్లలో చెప్పు? పది సెకండ్లే టైం... అని అడిగాడు. రావెల ఆలోచించే లోపే పక్కన కోడెల... వన్, టు, త్రి, ఫోర్.. టెన్... టైం ఓవర్ నువ్వు వెళ్లొచ్చు అని చెప్పాడు. దాంతో రావెల అక్కడనుండి లేచాడు. తర్వాత పల్లె రఘునాథరెడ్డిని పిలిచారు. ఈసారి చంద్రబాబు... రాష్ట్రంలో వున్న తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీల స్కోర్ చెప్పు? అని అడిగాడు. సార్, అచ్చం తెలుగుదేశం వాళ్లా, లేక వైసిపి నుండి వచ్చినవాళ్లను కూడా కలుపుకునా? అని ప్రశ్నించాడు. అందుకు చంద్రబాబు... నిన్ను ఆన్సర్‌లు మాత్రమే చెప్పమన్నాం, ఎదురు ప్రశ్నలు వేయమనలేదు, ఈ సింపుల్ క్వశ్చన్‌కు కూడా ఆన్సర్ చెప్పలేకపోయావ్, ఇక నువ్వు మంత్రిగా ఏం పనికొస్తావ్, వెళ్ళు అని చెప్పి పంపేసాడు. తర్వాత పీతల సుజాతను పిలిచారు? ఈసారి ప్రశ్న యనమల రామకృష్ణుడు వేసాడు. ఈరోజు మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర ఎంత? అని అడిగాడు. దానికామె... నేనీరోజు టీవీ, పేపర్ చూడలేదు సార్ అని అంది. బంగారం రేటెంతో కూడా తెలియని దానివి, మంత్రిగా ఏం చేయగలవ్... సరే వెళ్ళు అంటూ ఆమెను పంపేసారు. తర్వాత కిమిడి మృణాళినిని పిలిచారు. చంద్రబాబు వుండి... రోజా మొత్తం ఎన్ని సినిమాలలో నటించింది? వాటిలో తెలుగు సినిమాలెన్ని? తమిళ సినిమాలెన్ని? అని అడిగాడు. సినిమాల మీద నాకు ఐడియా లేద్సార్ అని ఆమె అంది. మన సహచర ఎమ్మెల్యే ఎన్ని సినిమాలలో నటించారో కూడా తెలుసుకోకుంటే ఎలాగమ్మా అని అంటూ సరే ఈ ప్రశ్నకన్నా సమాధానం చెప్పు అని... బండి షెడ్డులో ఉండాలి, ఆడది ఇంట్లో ఉండాలి, అప్పుడే సేఫ్టీ అని సెలవిచ్చిన మహానుభావుడెవరు? అని ప్రశ్నించాడు. ఆమె మనసులో కోడెల శివప్రసాద్‌రావు పేరు మెదిలింది... మళ్ళీ ఆయన కాకుండా ఈ మాటను రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, షేక్స్పియర్ లాంటి వాళ్లేమన్నా చెప్పారేమో అనే సందేహం కలిగింది. వెంటనే ఆమె... సార్, 'మీలో ఎవరు కోటీశ్వరుడు' కార్యక్రమంలో క్వశ్చన్‌కు నాలుగు ఆప్షన్స్ ఇస్తారు, కాబట్టి ఈ క్వశ్చన్‌కు కూడా నాలుగు సమాధానాలివ్వండి... వాటిలో రైట్ ఆన్సర్ ఏదో చెబుతానంది. అందుకు చంద్రబాబు ఎ) రమణమహర్షి బి) వాల్మీకి సి) కోడెల శివప్రసాద్‌రావు డి) స్వామి వివేకానంద అని ఆప్షన్స్ చెప్పాడు. మృణాళిని వెంటనే డి) స్వామి వివేకానందను ఫిక్స్ చేయమని అడిగింది. చంద్రబాబు ఆ ఆన్సర్‌ను ఫిక్స్ చేయగానే రాంగ్ అని వచ్చింది. తర్వాత చంద్రబాబే ఆమెతో... మీరు పుస్తకాలలో చదివే వాళ్లను తప్పితే కళ్ల ముందు కనిపించేవారిని మహానుభావులుగా గుర్తించరా అని కోడెలను చూపిస్తూ అడిగాడు. అప్పుడామె పొరపాటైందన్నట్లు నాలిక్కర్చుకుని వెళ్లిపోయింది.

తర్వాత నారాయణ... సార్, మంత్రివర్గం నుండి తొలగించాలనుకున్న ఐదుగురిని ప్రజాస్వామ్య పద్ధతిలో చాలా పద్ధతిగా తొలగించాం. ఇప్పుడు మంత్రి వర్గంలోకి కొత్తగా చేర్చుకునేవాళ్ళ సంగతి చూద్దామన్నాడు. అందుకు చంద్రబాబు... వైసిపి నుండి వచ్చిన ఆదినారాయణరెడ్డి, అఖిలప్రియ, అమర్‌నాథ్‌రెడ్డి, సుజయ్ రంగారావులకు ఎటువంటి పరీక్షలు అవసరం లేదు, ఎందుకంటే వాళ్ళు సమర్థులు కాబట్టే వైసిపి నుండి ఇక్కడకు జంప్ చేయగలిగారు. అదీగాక పక్కపార్టీల నుండి వచ్చినవాళ్ళకు మనం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నాం కాబట్టి పితాని సత్యనారాయణకు కూడా ఇంటర్వ్యూ అవసరం లేదు. ఎస్సీల నుండి జవహర్‌ను, ఎస్టీ నుండి నక్కా ఆనందబాబును రిజర్వేషన్ కోటాలో తీసుకుంటున్నాం కాబట్టి వాళ్లకూ పరీక్షలు అవసరం లేదు. ఇక కాల్వ శ్రీనివాసులు మొన్న అసెంబ్లీ సమావేశాలలోనే తన టాలెంట్‌ను ప్రూవ్ చేసుకున్నాడు. కిమిడి కళావెంకట్రావ్‌ను సీనియార్టీ దృష్ట్యా ఇంటర్వ్యూ నుండి మినహాయిస్తున్నాం. ఇక మిగిలింది నారా లోకేష్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అని చెప్పాడు. అందుకు నారాయణ... సోమిరెడ్డి ఒక్కడికే ఫిట్‌నెస్ మరియు ఇంటర్వ్యూ పెడదాం, లోకేష్‌ను ఇంటర్వ్యూ లేకుండానే సెలక్ట్ చేద్దామన్నాడు. దానికి చంద్రబాబు... నో.. అందుకు నేను ఒప్పుకోను... ప్రతిభ ఆధారంగానే పదవులు ఇవ్వాలనే మాటకు నేను కట్టుబడ్డాను. ధర్మదేవత నా ఇంట్లో వీల్‌ఛైర్‌లో తిరగడానికి, కాలిబర్స్‌తో నడవడానికి నేనొప్పుకోను... నా పాలనలో ధర్మం నాలుగు పాదాలతో నడవాలి, రెండు చేతులతో పాకాలి... న్యాయ దేవత నా ఇంట చిరునవ్వులు చిందించాలి. రాజ్యాంగ స్ఫూర్తి వెల్లివిరియాలి. పిలవండి లోకేష్‌ను, పెట్టండి అతని ప్రతిభకు పరీక్షను... నా కొడుకు ప్రతిభకు పరీక్ష కాబట్టి నేను ఇన్‌వాల్వ్ కాను అని గట్టిగా అరిచాడు. ధర్మం, న్యాయం, రాజ్యాంగ విలువల పట్ల చంద్రబాబుకున్న నిబద్ధత చూసి కోడెల, యనమల, నారాయణ కళ్ల వెంట ఆనంద భాష్పాలు రాలసాగాయి. భూమ్మీద ఇలాంటి ధర్మాత్ములు అక్కడక్కడా వుండబట్టే ఇంకా అప్పుడప్పుడు వర్షాలు కురుస్తున్నాయి, ఠంచన్‌గా ఎండలు మండిపోతున్నాయనుకుంటూ ఇంటర్వ్యూకు లోకేష్‌ను రమ్మనిచెప్పి ఆర్డర్ వేసారు.

**(ఇంకా వుంది)**

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థికపరమైన వత్తిడి ఇబ్బందులుండవచ్చును. ఖర్చులు ఏదో ఒక నెపంతో పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగి ఆదాయం సామాన్యంగా ఉంటుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు. సరైన నిర్ణయాలు తీసికొనలేని స్థితి ఉంటుంది. పెట్టుబడులకు వ్యాపార విస్తరణకు అనుకూల సమయం కాదు. వివాహాది ప్రయత్నాలలో జాప్యం జరుగుతుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తి వ్యాపారాలలో మంచి పురోగతి ఉంటుంది. ఆదాయం బాగుంటుంది. వృత్తి ఉద్యోగ రంగాలలో ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తారు. శుభకార్య ప్రయత్నాలు, అనుకున్న పనులు నెరవేరుతాయి. ఉద్యోగులకు స్థానచలనం ఉంటుంది. ఆస్తి కుటుంబ వ్యవహారాలు పరిష్కారానికి రాగలవు. ఆరోగ్యం ఫరవాలేదు. కొత్త వస్తువులు సమకూరడం, ఇతరులకు సహాయపడటం చేస్తారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అవసరాలు, అనుకున్న పనులు నెరవేరుతాయి. స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి. స్వల్పంగా అదనపు ఖర్చులుండినా ఇబ్బంది కలుగదు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. పెట్టుబడులకు వ్యాపార విస్తరణకు మంచి సమయం. దూర ప్రయాణాలుంటాయి. నూతన పరిచయాలు కలిగి మేలు జరుగుతుంది. ఆహ్వానాలు అందుకొంటారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అనుకున్న పనులు సవ్యంగా జరగడం వల్ల సంతృప్తి ఉంటుంది. కుటుంబంలో అభిప్రాయ భేదాలుండి సర్దుబాటు కాగలవు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం బాగుంటుంది. సోదరులకు మేలు జరుగుతుంది. మొగమాటాలు, పొగడ్తలకు లోబడవద్దు. ఉద్యోగులకు విధి నిర్వహణలో సమర్థత, గుర్తింపు గౌరవాలు బాగుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తివ్యాపారాలు సంతృప్తికరంగా ఉండి ఆదాయం కూడా బాగుంటుంది. అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. ఆలోచనలు వ్యాపకాలు పెరిగి టెన్షన్ పడుతుంటారు. ఉద్యోగులు అధికారులతో పబ్లిక్‌తో జాగ్రత్తగా మెలగండి. ప్రభుత్వ కాంట్రాక్టులు, అనుమతులందు ఆలస్యం జరుగుతుంది. వస్తు వాహన గృహ రిపేర్లుంటాయి. కొత్త నిర్మాణాలు చేపడతారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అనుకోని ఖర్చుల భారం పైనబడుతుంది. అయినా ఇబ్బందులను అధిగమిస్తారు. వృత్తిపరంగా పెరుగుదల బాగుంటుంది. వ్యాపారస్తులకు అవకాశాలు చేజారడం, ఆశించిన ఆదాయం లేకపోవడం ఉంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు, కొత్త వస్తువుల కొనుగోలు ప్రయత్నాలు వాయిదా వేసికొనండి. బంధువుల వల్ల ఇబ్బందులేర్పడవచ్చును. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 7.4.2017 నుండి
తేది. 13.4.2017 వరకు

ఈ వారం మేషంలో కుజబుధులు, సింహంలో రాహువు, కన్యలో గురువు, ధనుస్సులో శని, కుంభంలో కేతువు, మీనంలో రవి శుక్రులు, సింహ కన్య తులా రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము

ముహూర్తములు

7తేది శుక్రవారము ఉదయం గంట 8.08 నుండి గంట 9.56 వరకు వ్యాపార గృహారంభ వివాహాదులు వృషభలగ్నము.

10తేది సోమవారము ఉదయం గంట 9.0 నుండి గంట 9.47 వరకు వ్యాపార గృహారంభ అన్నప్రాశనలకు వృషభ లగ్నము.

12తేది బుధవారము రాత్రి గంట 12.20 నుండి గంట 2.26లోగా వివాహము మకరలగ్నము.

### చైత్ర మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 7 | శుక్ర | ఏకాదశి | ఉ॥ గం.10.31వ॥ |
| తేది. 8 | శని | ద్వాదశి | ఉ॥ గం.9.43వ॥ |
| తేది. 9 | ఆది | త్రయోదశి | ఉ॥ గం.9.27వ॥ |
| తేది. 10 | సోమ | చతుర్దశి | ఉ॥ గం.9.37వ॥ |
| తేది. 11 | మంగళ | పూర్ణిమ | ఉ॥ గం. 10.20వ॥ |

### చైత్ర మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 12 | బుధ | పాడ్యమి | ప॥ గం.11.33వ॥ |
| తేది. 13 | గురు | విదియ | ప॥ గం.1.10వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థిక విషయాలలో జాగ్రత్తపడండి. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. దీర్ఘకాల సమస్యలకు ముగింపు పలకండి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. ఉద్యోగులు తమ సహచరులతో అధికారులతో జాగ్రత్త పడండి. ప్రభుత్వంతో సంబంధించిన పనులు ఆలస్యం కాగలవు. నిర్మాణాలు వేగవంతంగా కొనసాగుతాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును. బంధువర్గంతో సమస్యలు, వివాదాలు వచ్చే అవకాశమున్నది కాబట్టి జాగ్రత్తపడాలి. వృత్తివ్యాపారాలు సామాన్యంగా జరిగి ఆదాయం సామాన్యంగా ఉంటుంది. కొత్త వ్యాపార అవకాశాలు వెనుకబడతాయి. త్వరలోనే ఆర్థిక మార్పులుండవచ్చును. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు అనుకూలత బాగుంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థికస్థితి బాగుండి వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు లభిస్తాయి. ఆదాయం పెరుగుతుంది. కొత్త వ్యాపారాలకు, పెట్టుబడులకు అవకాశాలు అందుతాయి. సంస్థలకు, సత్కర్మలకు సహాయపడతారు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. రావలసిన ప్రభుత్వ అనుమతులు పత్రాలు లభిస్తాయి. కుటుంబానికి రావలసిన బాకీలు లభించడం, కోర్టు కేసులందు అనుకూలత ఉంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

మీ పనులు జరగడానికి బంధుమిత్రులు సహాయపడతారు. అనవసర వ్యవహారాలలో కలుగజేసికొనవద్దు. వృత్తివ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. కుటుంబంలో చిన్నచిన్న విభేదాలు వచ్చి సర్దుబాటు కాగలవు. శుభకార్యాలు ఫలించే అవకాశం ఉన్నది. ఉద్యోగులు అధికారులకు అనుగుణంగా నడుచుకొనండి. రావలసిన బాకీలు కొంత లభించగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

విమర్శలు, నిందలు తగ్గించి ఇతరులతో సామరస్యంగా మెలగండి. అనుకున్న పనులు టెన్షన్ పెట్టగలవు. అయితే సమస్యలను పరిష్కరించుకొనగల సామర్థ్యం ఉంటుంది. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. పిల్లల చదువులు, వివాహాలపై దృష్టి పెడతారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. నూతన వస్తువులను సమకూర్చుకొంటారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

మంచి పనులకు, దైవ కార్యాలకు సహాయం చేస్తారు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. దూరప్రయత్నాలుంటాయి. బంధుమిత్రులను కలుసుకొంటారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. సభలు సమావేశాలలో ప్రముఖంగా వ్యవహరించగలరు. ఉద్యోగార్థులకు అవకాశాలు లభిస్తాయి. ఆరోగ్యం ఫరవాలేదు.




# 'వండర్ బాయ్'.. ఉషా కృష్ణమూర్తి.. ఇక లేడు

**ఇంద్రజాలంలో అద్భుతాలు సృష్టించి ఎన్నో అవార్డులు సాధించి.. అందరి ప్రశంసలు అందుకుని, మేజిక్ రంగంలో నెల్లూరుసీమకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన మన 'వండర్‌బాయ్'.. ఉషా కృష్ణమూర్తి.. ఇక లేరు.**

గత కొద్దికాలంగా అస్వస్తులుగా వుండి ముంబైలో తన కుమారుడి వద్ద వుంటూ, ఈ నెల 2వతేదీ థానే జూపిటర్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ కన్నుమూశారు. వయసు 72 సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. సోమవారం ఆయన అంత్యక్రియలు థానేలో జరిగాయి. ఇంద్రజాల కళా కృష్ణమూర్తిగా పేరుగడించి, నెల్లూరు సీమలో మేజిక్‌రంగానికి, కళారంగానికి నిరుపమానమైన సేవలందించిన ఉషా కృష్ణమూర్తి మరణం..నెల్లూరీయులను, ప్రత్యేకించి ఆయన అభిమానులను కంట తడిపెట్టించింది. ఆయన మృతికి తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ మేజిక్-కళా-సేవా రంగాల్లోని పలువురు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయనకు ఘన నివాళులర్పించారు.

ఉషా కృష్ణమూర్తి అంటే నెల్లూరులో తెలియనివారుండరు. ట్రంకురోడ్డులో ఉషా ఫోటో స్టూడియో కూడా అందరికీ సుపరిచితమే. ఆ ఫోటో స్టూడియోలో వుంటూ ఫోటోగ్రాఫ్‌లను అందంగా తీర్చిదిద్దుతూ..కవులు, కళాకారులందరినీ ఆదరిస్తూ..అందరికీ ఎంతో ఆత్మీయంగా వుండే స్నేహమూర్తి..ఉషా కృష్ణమూర్తి. ఆయన అసలు పేరు కూరపాటి కృష్ణమూర్తి.

నెల్లూరులోని సీనియర్ లాయర్ శ్రీ కూరపాటి కోదండరామయ్య-అలంకారమ్మ దంపతుల ద్వితీయ పుత్రుడు కృష్ణమూర్తి. 1938 ఫిబ్రవరి 24న ఆయన జన్మించారు. విద్యాభ్యాసం అనంతరం సివిల్ డ్రాఫ్టుమన్, ఫిట్టర్ కోర్సులను పూర్తిచేశారు. బెంగుళూరులో ఓ ఎలక్ట్రికల్స్ కంపెనీలో పనిచేస్తుండగా, 1967లో జరిగిన ప్రమాదంలో ఆయన కాలు దెబ్బతినడంతో, ఆ ఉద్యోగం నుంచి తప్పుకుని, సొంత వూరైన నెల్లూరుకు చేరుకున్నారు. ఫోటోగ్రఫీలో వున్న అభిరుచితో నెల్లూరులో 1968 ఫిబ్రవరి 1వ తేదిన ట్రంకురోడ్డులో 'ఉషా ఫోటోస్టూడియో'ను స్థాపించారు. 1974లో సిలోన్‌లో పర్యటించి అక్కడ పలు దృశ్యాలను చిత్రీకరించగా, వాటికి ఆయనకు ఉత్తమ ఛాయాగ్రాహకునిగా ఘనమైన అవార్డు లభించడం విశేషం. ఆ తర్వాత అహ్మదాబాద్, న్యూఢిల్లీల్లో కొంతకాలం వుండి ఛాయాచిత్ర కళలో మంచి సాంకేతిక నైపుణ్యం సంపాదించుకున్నారు. ఫోటోగ్రఫీలో అద్భుతాలు సృష్టిస్తూ తన ప్రత్యేకతను చాటుకునేవారు. నెల్లూరు ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్‌కు 27 ఏళ్ళపాటు అధ్యక్షునిగా కూడా పనిచేశారు.

## చిన్ననాటి నుంచి మేజిక్ అంటే మక్కువ ఎక్కువ :

ఫోటోగ్రాఫర్‌గా మంచి పరిణతి సాధించినప్పటికీ కృష్ణమూర్తికి చిన్ననాటి నుంచి మేజిక్ అంటే ఎంతో ఇష్టం. తన తాతగారైన చెంగల్రావు నుంచి, మేనమామలైన గోటూరు చంద్రశేఖర్, గోటూరు రాధాకృష్ణల వద్ద మేజిక్ ట్రిక్‌లను సాధన చేశారు. 1952 ప్రాంతంలోనే హైస్కూల్‌లో తొలిసారిగా మేజిక్ ప్రదర్శన ఇచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. ఉద్యోగం నుంచి తిరిగి నెల్లూరుకు వచ్చేశాక, 1984 నుంచి మళ్ళీ ఆయన మేజిక్ రంగంలో ప్రవేశించి ఎన్నో ప్రదర్శనలు అత్యద్భుతంగా నిర్వహించి మేజిక్ రంగంలో ఎంతో ఖ్యాతి గడించారు. విజయవాడకు చెందిన ప్రముఖ మెజీషియన్ బోస్ స్థాపించిన పీపుల్స్ మేజిక్ సర్కిల్ సంస్థలో ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు. 1998లో నెల్లూరులో అద్వితీయంగా మేజిక్ ఉత్సవాన్ని నిర్వహించి 'ఇంద్రజాల కళామూర్తి' అన్పించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ మెజీషియన్స్ అసోసియేషన్‌కి కూడా అధ్యక్షునిగా పనిచేసి ఎన్నో మేజిక్ ప్రదర్శనలిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అక్షరజ్యోతి, అక్షర సంక్రాంతి తదితర పథకాల ప్రచారాలకు కృష్ణమూర్తి మేజిక్ ప్రదర్శనలు తప్పనిసరిగా వుండేవి. అంతేకాదు, ప్రముఖ సినీనటుడు పద్మనాభం రంగస్థల ప్రదర్శనల్లో కృష్ణమూర్తికి ప్రత్యేకస్థానం వుండేది. అదేవిధంగా ప్రముఖ సినీ హాస్యనటుడు, మెజీషియన్ టి.రమణారెడ్డికి కూడా కృష్ణమూర్తి ఎంతో సన్నిహితులు. రమణారెడ్డి మరణానంతరం ఆయన మేజిక్ సామగ్రి కృష్ణమూర్తికి లభించాయంటే వారి సాన్నిహిత్యం, మేజిక్‌పై వారికున్న అభిమానం ఎంత గాఢంగా వుండేదో తేటతెల్లమవుతుంది. అంతేకాదు, నాటకరంగంలో ఆయన మంచి హాస్యనటునిగా రాణించారు. అటు పౌరాణిక, ఇటు సాంఘిక నాటకాల్లో ఆయన పాత్రోచితంగా నటించి అందరి ప్రశంసలు అందుకున్నారు.

## సేవాభావం మూర్తీభవించిన కళాకారుడు :

సేవాభావం మూర్తీభవించిన కళాకారుడు కృష్ణమూర్తి. వికలాంగులకు తన స్టూడియోలో ఉచితంగా ఫోటోలు తీసిచ్చేవారు కూడా. 1979లో లయన్స్ క్లబ్‌లో చేరి, ఆ సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో ఒకరిగా వుంటూ లయన్స్‌క్లబ్ తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి అక్షరజ్యోతి, అక్షరసంక్రాంతి వంటి కార్యక్రమాల్లో ఉషా కృష్ణమూర్తి మేజిక్ ప్రదర్శనలు అందరినీ బాగా ఆకట్టుకునేవి. పాఠశాల విద్యార్థుల్లో స్ఫూర్తిని కలిగించేందుకు ఉచితంగానే ఆయన ఈ ప్రదర్శనలు నిర్వహించేవారు. లయన్స్, రోటరీ, జేసీస్, అవోపా వంటి ప్రసిద్ధ సేవాసంస్థల్లో జరిగే పలు సభలు సమావేశాల్లో ఆయన ఇంద్రజాల ప్రదర్శనలు హైలైట్‌గా వుండేవి.

## ఎన్నెన్నో అవార్డులు..ఘన సత్కారాలు :



జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఎన్నో మేజిక్ ప్రదర్శనలిచ్చి ఇంద్రజాల కళలో ఎన్నో విశిష్టమైన అవార్డులను, ఘన సన్మానాలూ అందుకున్నారు. నాటకరంగం, సేవారంగం, ఫోటోగ్రఫీ రంగాలకు ఆయన చేసిన సేవలు అపారం. ఈ సేవలతోనే ఆయన ఎన్నో సంస్థల నుంచి, ప్రముఖుల నుంచి విశిష్టమైన అవార్డులను, సత్కారాలను అందుకున్నారు.1989లో నెల్లూరులోని కళాభారతి సంస్థ ఆయనను 'ఇంద్రజాల రారాజు' అనే బిరుదునిచ్చి గౌరవించింది. అదేవిధంగా ఆయనకు నెల్లూరులోని పలు సంస్థలు 'తాంత్రిక చక్రవర్తి', 'ఇంద్రజాల కళామూర్తి' అనే బిరుదులతో సత్కరించాయి. నెల్లూరులోని 'లాయర్' వారపత్రిక యాజమాన్యం మేజిక్ రంగంలో ఆయన ప్రతిభా పాటవాలకు గుర్తింపుగా 1994లో 'బెస్ట్ మెజీషియన్' అవార్డుతో సత్కరించింది. మేజిక్ రంగంలో ఆయన గోల్డ్‌మెడల్ కూడా అందుకున్నారు. ఫన్ ఆర్ట్స్ అకాడమీ తరపున 2003లో విశ్వవిఖ్యాత ఇంద్రజాలికుడు పి.సి సర్కార్ (సీనియర్) అవార్డును కూడా అందుకుని మేజిక్ రంగంలో నెల్లూరు సీమ విఖ్యాతిని రెపరెపలాడించారు. మద్రాస్ తెలుగు అకాడమీ నుంచి అదే సంవత్సరంలో 'సమైక్యభారత్ గౌరవ్ సత్కార్'ను కూడా అందుకుని సింహపురి సీమకు మరింత గౌరవాన్ని తెచ్చారు. 'కళా తపస్వి', 'హాస్య నటరాజు' 'ఛాయాచిత్ర ధురీణ', 'హాస్యబ్రహ్మ', 'ఇంద్రజాల కళామూర్తి' వంటి అనేక విశిష్టమైన బిరుదులు ఆయనకు లభించాయి. మెజీషియన్లకు, కళారంగానికి ఎంతో సేవలందించిన శ్రీ కె.కృష్ణమూర్తికి ఈ ఏడాది జనవరి 22న ఇంద్రజాలరంగంలో ప్రఖ్యాతమైన 'బోస్ మేజిక్ అవార్డు'ను కూడా అందుకున్నారు. ఆ సందర్భంగా ఈ ఏడాది జనవరి 22వ తేదిన గుంటూరులో ఏర్పాటుచేసిన తెలుగు రాష్ట్రాల మేజిక్ ఉత్సవంలో ఆయన అవార్డుతో పాటు, 30వేల రూపాయల నగదు బహుమతిని కూడా అందుకున్నారు. ఇలా ఎంతో విశిష్టమైన రీతిలో బహుముఖ ప్రజ్ఞతో రాణించి నెల్లూరుకు ఎంతో కీర్తిప్రతిష్టలు తెచ్చిన ఉషా కృష్ణమూర్తి మృతి మేజిక్, కళా, సేవా రంగాలకు ఎనలేని లోటేనని వేరే చెప్పనక్కర లేదు. ఆ స్నేహమూర్తికి..ఇంద్రజాల కళామూర్తికి నివాళులర్పిస్తూ... ఆయన కుటుంబసభ్యులందరికీ ప్రగాఢ సంతాపాన్నీ, సానుభూతిని తెలియజేస్తోంది..'లాయర్'.




## శ్రీకాళహస్తి న్యూస్

### బుజ్జగించడానికి వచ్చిన దేశం నేతలను

# ఉతికి ఆరేసిన బృందమ్మ



మొన్న జరిగిన మంత్రివర్గ విస్తరణలో అటవీ శాఖామంత్రిగా వున్న సీనియర్ తెలుగుదేశం నాయకులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డిని తప్పించడం తెలిసిందే! అనారోగ్యాన్ని కారణంగా చూపి ఆయనను పక్కనపెట్టారు. వాస్తవానికి చిత్తూరుజిల్లాలోనే వైసిపి నుండి వలసవచ్చిన ఆకే అమరనాథ్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాల్సి రావడంతో చంద్రబాబు బొజ్జల పదవికి ఎసరు పెట్టాడు. ఒకే జిల్లా నుండి ఇద్దరు రెడ్లకు మంత్రిపదవులు ఇవ్వలేదు కదా! అయితే తీసేసిన మంత్రుల జాబితాలో తన పేరుందని తెలుసుకున్న బొజ్జల 1వ తేదీ రాత్రే తన సతీమణి బృందమ్మతో కలిసి చంద్రబాబు వద్దకు వెళ్ళి తనను ఈ రెండేళ్ళు క్యాబినెట్‌లో కొనసాగించాలని, తొలగించి తనను అవమాన పరచొద్దని కూడా వేడుకుని వచ్చాడు. అయితే చంద్రబాబు అవేమీ లెక్క చేయకుండా, మంత్రి వర్గం నుండి తొలగించడంతో బొజ్జల ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా పడేసి అలిగి కూర్చున్నాడు.



Date: 02.04.2017
Vijayawada.

To
The Hon'ble Speaker,
AP Legislative Assembly,
Velagapudi, Amaravathi.

Dear Sir,

Please accept this as my resignation from the position of Member of AP legislative Assembly representing form Srikalahasti Assembly Constituency with effect from 02.04.2017.

While I believe that I am moving for good reasons, I am sorry to leave, and I thank you for your support during my time as member of AP Legislative Assembly.

Yours sincerely,

(B.GOPALA KRISHNA REDDY)

"బొజ్జలను బుజ్జగిద్దామని వచ్చిన మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎంపి సియం రమేష్‌లకు మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ నుంచి చేదు అనుభవం ఎదురైంది. అనారోగ్యం సాకు చూపించి మంత్రి పదవి నుంచి తన భర్తను తప్పిస్తారా....? ఏ చంద్రబాబు ఆరోగ్యం మాత్రం బాగుందా....? ఆయనకు ఎటువంటి రోగాలు లేవా...? తన భర్తకు ఇంత అన్యాయం చేస్తారా? అని చంద్రబాబు పంపిన దూతలిద్దర్ని కడిగి పారేశారు బొజ్జల బృందమ్మ. దీంతో ఖంగుతిన్న సియం రమేష్ మేమంటే ఈ మధ్య వచ్చాం గానీ చంద్రబాబు, బొజ్జల ఎప్పటి నుంచో స్నేహితులు కదా అక్కా అని అనునయించబోయారు. దీంతో ఆమె, ఏం స్నేహమయ్యా... స్నేహం విలువ తెలిస్తే చంద్రబాబు ఇలా చేసేవాడా... స్నేహమంటే వై.ఎస్.రాజశేఖరరెడ్డిది. తన మిత్రుడు జక్కంపూడి రామ్మోహనరావు తీవ్ర అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్నా ఆయన చివరిరోజు వరకూ తన క్యాబినెట్‌లోనే పెట్టుకున్నాడని అంటూ... మీ రాయబారాలు, గీయబారాలు మాకొద్దు... మేమిక టిడిపిలో ఉండదల్చుకోలేదు... మాకు నచ్చిన ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరతాం లేకపోతే శ్రీకాళహస్తిలో స్వతంత్రగానే పోటీ చేస్తాం ఇక మీరు దయచేయండి అని నిష్కర్షగా చెప్పేశారు. దీంతో అక్కడే ఉన్న మంత్రి గంటా శ్రీనివాసరావు కలుగజేసుకుని పార్టీలు మారటాలు వంటి పెద్ద పెద్ద మాటలెందుకు లెండీ... సామరస్యంగా వెళదాం అన్నారు. దీంతో చిర్రెత్తుకొచ్చిన బృందమ్మ... నువ్వెవరివి మాట్లాడ్డానికి, ఇప్పటి వరకూ నువ్వు ఎన్ని పార్టీలు మారావు... నీ చరిత్ర ఏంటీ... అసలు వచ్చే ఎలక్షన్ల వరకూ నువ్వు టిడిపిలో ఉంటావా... నువ్వా మాకు నీతులు చెప్పేది అని లెఫ్ట్ అండ్ రైట్ ఇవ్వడంతో గంటాకు నోటిమాట రాలేదు. బొజ్జల సతీమణి ఆగ్రహం తట్టుకోలేక గంటా, సియం రమేష్ లిద్దరూ అక్కడనుంచి నిష్క్రమించారు.

మధ్యవర్తిత్వం నడిపిన నాయకులు బొజ్జలను ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు మాటగా చెప్పారు. మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కుమారుడు బొజ్జల సుధీర్‌రెడ్డిని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమిస్తామని బొజ్జలను సముదాయించారు. అయినా శ్రీకాళహస్తి ప్రజల్లో పూర్వపు ఉత్సాహం పూర్తిగా కొరవడింది. మంత్రి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ప్రజల్లో అసంతృప్తి ఎక్కువ కావడంతో అందరూ హైదరాబాదుకు వెళ్ళి ఆయనను పరామర్శిస్తూ వస్తున్నారు. ఏదిఏమైనా బొజ్జల కుటుంబసభ్యుల్లో నెలకొన్న ఆవేదన, అసంతృప్తి రాష్ట్ర స్థాయిలో ఎక్కడకు దారితీస్తుందో!



మార్చి 31వ తేదీ శ్రీకాళహస్తి వచ్చిన సందర్భంగా కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడును గజమాలతో సత్కరిస్తున్న బీజేపీ నాయకులు కోలా ఆనంద్

# జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

సమతావాది..బాబూ జగ్జీవన్‌రామ్ ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమైనవని, ముఖ్యంగా సమసమాజ స్థాపన కోసం దేశంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిన ఘనత బాబూ జగ్జీవన్‌రామ్‌దేనని జిల్లా జాయింట్‌కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ అన్నారు. బుధవారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహించిన బాబూ జగ్జీవన్ రామ్ 110వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాబూ జగ్జీవన్‌రామ్ ఉపప్రధానిగా వున్న సమయంలో కార్మికుల కోసం, అట్టడుగు వర్గాల సముద్ధరణ కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయసాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి అతిథులందరూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి తదితరులు పాల్గొని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. అనంతరం గిరిపుత్రిక పథకం ద్వారా గిరిజన యువతకు రూ.50వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం, డి.డి మధుసూదనరావు, డ్వామా పి.డి హరిత, మెప్మా పి.డి చిరంజీవి, సెట్నెల్ సిఇఓ సుబ్రహ్మణ్యం, ఎస్సీ కార్పొరేషన్ ఇ.డి రామచంద్రారెడ్డి, ఎస్సీఎస్టీ కమిషన్ డైరెక్టర్ బద్దెపూడి రవీంద్ర పాల్గొన్నారు.



అలాగే వేదాయపాళెం సెంటర్‌లో వున్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



# రైతే...రాజు

(మొదటి పేజీ తరువాయి)

ఎంతోకాలంగా ఊరించి ఊరించి ఎట్టకేలకు ఈ నెల రెండో తారీఖున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన మంత్రివర్గాన్ని విస్తరించారు. ఇప్పుడున్న మంత్రుల్లో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, పీతల సుజాత, రావెల కిషోర్‌బాబు, కిమిడి మృణాళినిలను తొలగించారు. కొత్తగా 11మందికి చోటు కల్పించారు. చంద్రబాబు తనయుడు, భావి రాజకీయ వారసుడు లోకేష్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవాల్సి వచ్చింది కాబట్టి మంత్రివర్గ విస్తరణ చేపట్టాల్సి వచ్చింది. దానివల్లనే లోకేష్‌తో పాటు ఇంకో పది మందికి కూడా మంత్రి పదవులు దక్కాయి. లోకేష్ సబ్జెక్ట్ లేకుంటే చంద్రబాబు ఈ టర్మ్‌లో ఇక మంత్రివర్గ విస్తరణ జరిపి వుండేవాడు కాదు. వీళ్ళకు పదవులూ దక్కేవికావు. నెల్లూరుజిల్లా నుండి తెలుగుదేశం కార్యకర్తలు కోరుకున్నట్లుగానే ఎక్కువ మంది నాయకులు, అందులోనూ సొంత సామాజికవర్గం నాయకులు వ్యతిరేకించినా కూడా చంద్రబాబు ఏ మాత్రం ఖాతరు చేయకుండా 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, జిల్లాలో పార్టీ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. నిన్న జరిగిన మంత్రివర్గ విస్తరణలో చంద్రబాబు తీసుకున్న మంచి నిర్ణయం ఏదన్నా ఉందంటే పార్టీ సీనియర్లయిన కిమిడి కళావెంకట్రావ్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలను మంత్రివర్గంలోకి తీసుకోవడమే! మిగతా మంత్రుల విషయంలో ప్రతి జిల్లాలోనూ అసమ్మతి జ్వాలలు రేగడం తెలిసిందే!

## కీలకశాఖ కేటాయింపు!

ఓ పక్క మంత్రి నారాయణ మోకాలడ్డం పెట్టినా దాటుకుని మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న సోమిరెడ్డికి అంతగా ప్రాధాన్యత లేని సమాచారశాఖో, పౌరసరఫరాల శాఖో ఇస్తారని భావించారు. కాని క్యాబినెట్‌లోనే అత్యంత కీలకమైన, కోట్లాది మంది అన్నదాతల భవిష్యత్‌తో, బ్రతుకులతో ముడిపడిన వ్యవసాయశాఖను ఆయనకు అప్పగించారు. ఇది ఆషామాషీ శాఖ కాదు. సోమిరెడ్డి సమర్థతపై చంద్రబాబు పెట్టుకున్న నమ్మకానికి ఇది నిదర్శనం. ఈ రాష్ట్రంలో అతిపెద్ద ఓటు బ్యాంకు రైతులే! 2004లో, 2009లో వై.యస్.ను అధికారంలోకి తెచ్చింది రైతులే! 2014లో చంద్రబాబుకు అధికారం కట్టబెట్టింది కూడా రైతులకిచ్చిన ఋణమాఫీ వాగ్దానమే!

రైతుల్లో వ్యతిరేకత తెచ్చుకున్న ప్రభుత్వమేదీ ఇంతవరకు ఎన్నికల్లో గెలిచిన దాఖలాలు లేవు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం ఋణమాఫీ విషయంలో వైఫల్యం చెంది కొంతవరకు రైతులను వ్యతిరేకం చేసుకుంది. రైతుల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను రైతుల దృష్టికి తీసుకెళ్ళడంలో ఇప్పటివరకు చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందనే చెప్పవచ్చు. ఇక ఎన్నికల సీజన్ మొదలు కానుంది. రైతుల్లో ప్రభుత్వంపై సానుకూలత పెంచుకోవాలి. రైతుల కోసం చేస్తున్న పనులను చెప్పుకోగలగాలి. రైతాంగం కోసం ఇంకొన్ని కొత్త కార్యక్రమాలు చేపట్టాలి. కాబట్టి సరైన సమయంలో సోమిరెడ్డికి వ్యవసాయశాఖను అప్పగించడం ద్వారా చంద్రబాబు సరైన నిర్ణయం తీసుకున్నాడని చెప్పవచ్చు.

ఇక మంత్రిగా వ్యవసాయ శాఖను చేపట్టడమంటే అది సోమిరెడ్డికి అదృష్టం. ఒక మంచి అవకాశం కూడా! ఈ జిల్లా నుండి స్వర్గీయ ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిలు వ్యవసాయశాఖ మంత్రులుగా పనిచేసారు. ఈ జిల్లా నుండి వ్యవసాయశాఖ మంత్రి అయిన నాలుగో నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి.

తండ్రి స్వర్గీయ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి జన్మనిస్తే, రాజకీయ ఓనమాలు నేర్పిన నాయకుడు మేనమామ స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి. తండ్రిలోని విశాల దృక్పథాన్ని, మేనమామలోని ప్రజా సంబంధాల తత్వాన్ని పుణికి పుచ్చుకున్న సోమిరెడ్డి జిల్లా రాజకీయ రంగంలో తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. ఆయనలో మెచ్చుకోదగిన రాజకీయగుణం గెలిచినప్పుడు, పదవులు చిక్కినప్పుడు పొంగిపోయే రకం కాదు... పార్టీ కష్టాల్లో వున్నప్పుడు పక్కదారులు వెదుక్కోలేదు. తన దారి తాను చూసుకోలేదు. పార్టీ కోసం నిలబడ్డాడు, పార్టీకి అండగా నిలిచాడు. జిల్లాలో పార్టీని ముందుకు నడిపించాడు. పార్టీ ఎక్కడకు పొమ్మంటే అక్కడకు పోయాడు. ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ పోటీ చేసాడు. ఓటములు ఎదురైనా ఓర్పును కోల్పోలేదు. కష్టాలను, ఆర్థిక నష్టాలను భరించాడు. పార్టీ అధికారంలో వున్నప్పుడు కాకుండా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, పార్టీ కేడర్ నైరాశ్యంలో వున్నప్పుడు కార్యకర్తలకు గుండె ధైర్యంగా నిలిచి ముందుకు నడిచాడు. కాబట్టి చంద్రమోహన్‌రెడ్డి ఈ జిల్లాలో మంత్రి పదవికి అన్ని విధాలా అర్హుడు, సమర్థుడు. ఆయనకు మంత్రి పదవి ఇవ్వడంలో న్యాయం వుంది కాబట్టే మంత్రివర్గ విస్తరణ తర్వాత అన్ని జిల్లాల తెలుగుదేశంపార్టీలో అసంతృప్తి వెల్లువెత్తినా నెల్లూరుజిల్లా తెలుగుదేశం కేడర్‌లో మాత్రం ఆనందం తాండవిస్తోంది.



# పోలియో చుక్కలు వేసిన ప్రతాప్

నెల్లూరుజిల్లా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఈ నెల 2వ తేదీన కావలి ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలలో పల్స్‌పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నపిల్లలకు పోలియోచుక్కలు వేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సమాజంలోని అందరూ బాధ్యత తీసుకుని వారి పరిధిలో 5సంవత్సరాల లోపు చిన్నపిల్లలందరికీ పోలియోచుక్కలు వేయించే విధంగా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు.

# నేతాజీ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు



నెల్లూరు శ్రీ నేతాజీ(ఎంఎస్‌ఆర్) పైలట్ హైస్కూలు విద్యార్థులు ఇంగ్లీషు ల్యాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ వారు నిర్వహించిన 6వ రాష్ట్ర స్థాయి(ఆంధ్ర, తెలంగాణ) ఇంగ్లీషు ప్రొఫిషియన్సీ టెస్ట్-2016 ఫలితాల్లో 7వ తరగతి విద్యార్థి ఎం.సింధూర్ రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు, బి.వర్షిత రాష్ట్ర స్థాయి 13వ ర్యాంకు సాధించినట్లు స్కూలు కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

# విస్తరణతో బయటపడ్డ విభేదాలు


(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు ఎవరికి పదవులు ఇచ్చినా ఇవ్వకున్నా, పార్టీ నాయకులు మౌనం వహించారంటే కారణం అప్పుడున్నది ఒరిజినల్ తెలుగుదేశం పార్టీ, ఒరిజినల్ తెలుగుదేశం నాయకులు. కాని ఇప్పుడున్నది ఒరిజినల్ తెలుగుదేశం కాదు, 50శాతం తెలుగుదేశం, పాతిక శాతం కాంగ్రెస్, ఇంకో పాతిక శాతం వైయస్సార్ కాంగ్రెస్. కాబట్టి చంద్రబాబు ఏకపక్ష ధోరణులను ఆ పార్టీ నాయకులు ఈసారి ధైర్యంగా ప్రశ్నించగలిగారు. నేనేం తప్పు చేసానని నన్ను మంత్రి పదవి నుండి పీకేసారంటూ చిత్తూరు జిల్లాలో బొజ్జల ప్రశ్నించారు. ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేశారు. బొజ్జలకు అనుకూలంగా అక్కడ కార్యకర్తలు కూడా రోడ్డెక్కారు. అనంతపురం జిల్లాలో మంత్రి పదవి ఇవ్వనందుకు పయ్యావుల కేశవ్ రుసరుసలాడారు. కడపజిల్లాలో వైసిపి నుండి వచ్చిన ఆదినారాయణ రెడ్డికి మంత్రి పదవి ఇచ్చినందుకు రామసుబ్బారెడ్డి ఆగ్రహించారు. వరుసగా గెలుస్తున్నా తనకు మంత్రి పదవి ఇవ్వనందుకు గుంటూరుజిల్లాలో ధూళిపాల నరేంద్ర అలిగాడు. కృష్ణా జిల్లాలో బోండా ఉమామహేశ్వరరావు అయితే మంత్రిపదవి రానందుకు తీవ్రంగా మనస్థాపం చెందాడు. ఇది కాపులకు జరిగిన అన్యాయమంటూ వాపోయాడు. మూడేళ్ళ నుండి అసెంబ్లీలోనూ, బయట ప్రతిపక్ష నేత జగన్‌పై అందరికంటే ఎక్కువగా ఆయన నోరు పారేసుకున్నది మంత్రి పదవి కోసమే! తీరా అది రాకపోయేసరికి నీరుగారి పోయాడు. ఇక బోండా ఉమా నోరు ఈ రెండేళ్ళు విశ్రాంతి తీసుకుంటుందేమో చూడాలి. ఇసుకరీచ్‌లో మహిళా తహశీల్దార్‌ను ఈడ్చి కొట్టడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపును సాధించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కూడా మంత్రి పదవి రానందుకు ఆగ్రహించాడు. ఈ మూడేళ్లలో తన పనితీరును చంద్రబాబు గుర్తించలేకపోయాడని వాపోతున్నాడు.

ఇక తెలుగుదేశం వ్యవస్థాపకులలో ఒకడైన తూర్పుగోదావరి జిల్లాకు చెందిన గోరంట్ల బుచ్చయ్యచౌదరి అయితే నేరుగా చంద్రబాబు మీదకే విమర్శలు ఎక్కుపెట్టాడు. పక్క పార్టీల నుండి వచ్చినవారికి మంత్రి పదవులివ్వడం ద్వారా తెలుగుదేశం పార్టీని వెన్నెముక లేని పార్టీగా చేస్తున్నారంటూ చంద్రబాబుపై నిప్పులు కక్కారు. అయితే ఈరోజు తనకు మంత్రి పదవి రాలేదని బుచ్చయ్యచౌదరి వైసిపి ఎమ్మెల్యేలను మంత్రి వర్గంలోకి తీసుకోవడం అనైతికమంటున్నాడు. అసలు వారిని పార్టీలోకి తీసుకుంటున్నప్పుడే బుచ్చయ్య, చంద్రబాబును నిలదీసి వుంటే ఈ పరిస్థితి వచ్చేదా?

ఇక విజయనగరంలో సుజయ్‌కృష్ణ రంగారావుకు మంత్రి పదవి ఇచ్చినందుకు అశోక గజపతిరాజు వర్గీయులు అలిగారు. విశాఖలో గౌతు శివాజీకి పదవి ఇవ్వనందుకు ఆయన వర్గీయులు నిరసన తెలిపారు.

తెలుగుదేశం చరిత్రలోనే మంత్రివర్గ విస్తరణ తర్వాత అత్యంత తీవ్రంగా నిరసన గళాలు వినిపించింది ఇప్పుడే! ఎప్పుడైతే తెలుగుదేశంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలకు కాకుండా కాంగ్రెస్, వైసిపిల నుండి వచ్చిన వాళ్ళకు చంద్రబాబు పెద్దపీట వేశాడో అప్పుడే తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణ అంతమైంది.



ఆవేశం కాదు ఆలోచనతో కూడిన ప్రసంగం... అర్థం పర్థం లేని మాటలతో కాదు అర్థవంతమైన వివరాలతో విమర్శలు... ఏ అంశం చర్చకు వచ్చినా ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడం... ఏ ప్రశ్న వేసినా ప్రభుత్వం నుండి సరైన సమాధానం రాలేకపోవడం... మొన్న ముగిసిన ఏపి శాసనసభ బడ్జెట్ సమావేశాలను చూస్తే రాటుదేలిన ప్రతిపక్ష నేతగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి కనిపిస్తాడు. ఈ సమావేశాలలో ఆయన ఎంతగానో రాణించాడు. ప్రతి అంశంపై చర్చలోనూ ఓర్పు - నేర్పు ఆయనలోని పరిణితికి అద్దం పడుతోంది. ముఖ్యంగా ఈ సమావేశాల ద్వారా జగన్ తన పార్టీ శ్రేణులకు తనది బలమైన నాయకత్వమనే ఒక నమ్మకాన్ని కలిగించాడు. అలాగే ప్రజా సమస్యలపై పోరాటం ద్వారా ప్రజల దృష్టిలోనూ పడ్డాడు.

# రాటుదేలిన జగన్

## ● అసెంబ్లీ సమావేశాలలో టాప్‌లేపిన ప్రతిపక్ష నేత ● అన్ని అంశాల్లోనూ విఫలమైన ప్రభుత్వనేత

గతంలో అసెంబ్లీ సమావేశాలను ప్రజలు పెద్దగా పట్టించుకునేవాళ్ళు కాదు. ఏదో సభలో అరుచుకుంటుంటారు, ఆ గోల మనకెందుకులే అన్నట్లుండేవాళ్ళు. కాని సమాజంలో ఇప్పుడు మీడియా విప్లవం వచ్చింది. ఇప్పుడు ప్రతి ఇంటిలోనే కాదు ప్రతి ఒక్కరి చేతుల్లోనూ స్మార్ట్ ఫోన్‌లు ఉంటున్నాయి. అసెంబ్లీలో ఎవరు ఏం మాట్లాడుతున్నారన్నది అప్పటికప్పుడు చూస్తున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వచ్చాక దేనిగురించైనా తెలుసుకోవడం సులభమవుతోంది!

ఈ సమావేశాలలో ప్రభుత్వ చర్యలను, అవినీతి అక్రమాలను ఉతికి ఆరేయడంలో ప్రతిపక్ష నేతగా జగన్ సక్సెస్ అయ్యాడు. ప్రతిపక్ష నేత దాడిని నేరుగా ఎదుర్కోలేక సభను వాయిదా వేయించడం, చర్చలను పక్కదారి పట్టించడం లేదా చర్చకు సంబంధం లేని అంశాలను లేవనెత్తి గందరగోళం సృష్టించడం వంటి చర్యల ద్వారా ప్రభుత్వం తన అసమర్ధతను చాటుకుంది. ముఖ్యంగా ఈ సమావేశాలలో కరువు, విజయవాడలో ఆర్టీఏ కమిషనర్‌పై తెలుగుదేశం ప్రజాప్రతినిధుల దౌర్జన్యం, అగ్రిగోల్డ్ భూముల కొనుగోలు, నారాయణ విద్యాసంస్థల్లో టెన్త్ పరీక్ష పేపర్ల లీకేజీ వంటి అంశాలు ప్రభుత్వాన్ని బాగా ఇరకాటంలో పెట్టాయి. జగన్ కూడా ఈ అంశాలపై అర్ధవంతంగా మాట్లాడారు. టెన్త్ పేపర్ల లీకేజీ విషయంలో వియ్యంకులు మంత్రులు గంటా శ్రీనివాసరావు, పి.నారాయణలకు ముచ్చెమటలు పట్టించారు. అగ్రిగోల్డ్ భూముల కొనుగోలులో మంత్రి పత్తిపాటి పుల్లారావు పాత్రను బయటపెట్టారు. ప్రభుత్వం గొప్పలకు పోయి అధిక శాతం వృద్ధిరేటు చూపడాన్ని కూడా ఏకిపారేసారు. ఆఖరకు వ్యక్తిగత చురకల విషయంలోనూ చంద్రబాబు వైఖరిని జగన్ ఎండగట్టిన తీరు ప్రశంసలందుకుంది.

ప్రధానంగా సవాళ్ళు ప్రతిసవాళ్ళతో ఈ సభ దద్ధరిల్లింది. ఈడి అటాచ్ చేసిన తన ఆస్తులకు సంబంధించిన చర్చలో జగన్ విసిరిన సవాల్‌ను స్వీకరించడానికి అధికారపార్టీ నాయకులెవరూ ముందుకు రాలేకపోయారు. దమ్ముంటే వైకాపా నుండి తెలుగుదేశంలో చేరిన 21మంది ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించి మళ్ళీ గెలిపించుకోమన్న జగన్ ఛాలెంజ్‌ను తెలుగుదేశం నేతలు స్వాగతించలేదు. చంద్రబాబు టైం బాగుండి పట్టిసీమ ప్రాజెక్ట్‌పై కాగ్ నివేదిక అసెంబ్లీ సమావేశాల ఆఖరిరోజు వెలువడింది. ఒక్కరోజు ముందు 'కాగ్' రిపోర్ట్ వచ్చివున్నా దీనిపై సభలో పెద్ద యుద్ధమే జరిగివుండేది. పట్టిసీమ ప్రాజెక్ట్‌లో పెద్దఎత్తున అవినీతి జరిగిందని, పోలవరం పూర్తయితే ఇది నిరర్ధక ప్రాజెక్ట్‌గా మారుతుందని 'కాగ్' తన రిపోర్ట్‌లో తూర్పారబట్టింది. ఎన్ని వందల కోట్లు అవినీతి జరిగిందో లెక్కలతో సహా బయటపెట్టింది. ఒక్కరోజు ముందు ఈ రిపోర్ట్ వచ్చివున్నా అసెంబ్లీలో ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ఆడుకుని ఉండేది. పట్టిసీమ దండగమారి ప్రాజెక్ట్ అని, పోలవరం పూర్తయితే దీనివల్ల ఉపయోగముండదని అసెంబ్లీలో జగనే కాదు బయటకూడా ఎంతోమంది మేధావులు చెప్పారు. కాని చంద్రబాబు పట్టుదలగా పట్టిసీమను చేపట్టడం వెనుకవున్న ఉద్దేశ్యం వేరే! కాగ్ ఇచ్చిన రిపోర్ట్‌లోనే ఆ ఉద్దేశ్యం ఏంటో బయటపడింది.

సభలో ఆద్యంతం ప్రతిపక్షంపై ఎదురుదాడి ప్రయత్నమే జరిగింది. ప్రతిపక్షాలకు మాట్లాడే విషయంలో పక్షపాత వైఖరి కనిపించింది. నలుగురు సభ్యులున్న బీజేపీ శాసనసభ పక్ష నేతకు ఎంత సమయం కేటాయించారో 70 మంది సభ్యులున్న ప్రతిపక్ష నేతకు కూడా దాదాపు అంతే సమయం కేటాయించడం వివక్షకు అద్దం పడుతోంది. అయినా కూడా తనకు వచ్చిన తక్కువ సమయాన్నే జగన్ బ్రహ్మాండంగా సద్వినియోగం చేసుకుని... ఇక పులితో వేట... జగన్‌తో ఆట ఒకటే అన్న రీతిలో రెచ్చిపోయాడు.







Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com